ENTERED

కథా నిలయం
శ్రీకాకుళం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

మే 11, 2008



పాపాయిని స్వాగతిద్దాం

హ్యాపీబర్త్‌డే

(2008 మే-11 నుంచి-2008 మే-17వరకు)

కె. సందీప్ (దుత్తు)
4సం॥, మే-11
మాధవి-బసవయ్య
పిల్లాయిపల్లి-నల్లగొండ

దీప్తి
మే
రత్న-రాములు
ఖిలాసాపూర్-వరంగల్

ఎం. అరవింద్‌కుమార్
2సం॥, మే-11
అనిత-యాదగిరి
ఖానాపూర్-రంగారెడ్డి

టి. శ్రీనందన్
3సం॥, మే-15
జ్యోతి-హనుమంతరావు
వల్లాపురం-ఖమ్మం

పి. మనోజ్
1సం॥, మే-2007
లక్ష్మి-కృష్ణ
చిట్టినగర్-విజయవాడ

కె. ఎలిజబెత్ షారోన్
3సం॥, మే-11
ఆశా థెరిసా-కృపాదర్శన్
చందానగర్-హైదరాబాద్



బి. మణికంఠ
6సం॥, మే-2002
కోమలి-శ్రీనివాసరావు
కంభంపాడు-కృష్ణా

యు. సంహిత
1సం॥, మే-17
శ్రీదేవి-సింహాచలం
కె.ఎల్.పురం-విజయనగరం

ENTERED



గాంధీ, భగత్‌సింగ్ ఆశయాలను నెరవేర్చాలి

మన అతిథి

పేరు : పరకాల పట్టాభిరామారావు
తల్లిదండ్రులు : మాణిక్యమ్మ, వెంకట సూర్యనారాయణ
పుట్టినవూరు : కవిటం, పశ్చిమగోదావరి జిల్లా
పుట్టిన తేది : 16-11-1920
విద్య : ఇంటరు
వృత్తి : జర్నలిజం. కమ్యూనిజమ్ మాసపత్రికలో 60 సంవత్సరాలపాటు, విశాలాంధ్ర దినపత్రిక ఎడిటోరియల్ బోర్డు సీనియర్ మెంబరుగా (1992 నుండే 2002 వరకూ), కమ్యూనిస్టు మాసప్రతికకు ఎడిటర్‌గా పని చేశాను.
స్ఫూర్తి : గాంధీజీ, భగత్ సింగ్ జీవితం, వారి ప్రసంగాలు, ఉద్యమాలు
నచ్చిన వ్యక్తులు : గాంధీ, భగత్ సింగ్, పి.సి. జోషి
నచ్చిన రచనలు : గద్దే లింగయ్య గారి 'విప్లవ వీరులు', మార్క్స, ఏంగెల్స్ కమ్యూనిస్టు సిద్ధాంతాలు.
స్వీయ రచనలు : జాతీయ కవి గరిమెళ్ళ సత్యనారాయణ జీవితం- రచనలమీద పుస్తకం, దేవుడు చేసిన మనుషుల్లారా! మనుషులు చేసిన దేవుళ్ళారా మీ పేరేమిటి? అనే గురజాడ రచనపై గురజాడ శేషప్రశ్న గా పరిశోధనా గ్రంథం, మరో ఇరవై గ్రంథాలు రాశాను.
అవార్డులు : 1981 సోవియట్ ల్యాండ్ నెహ్రూ అవార్డు , 1999 ఢిల్లీ తెలుగు అకాడమీ అవార్డు , 2001 పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ (జర్నలిజంలో) ప్రతిభా పురస్కారం.
మరచిపోలేని సంఘటన: 16వ ఆంధ్ర రాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ మహాసభ ఆహ్వాన సంఘ కార్యదర్శిగా... కాకినాడ పి. ఆర్ కళాశాలలో (1939 సెప్టెంబర్1న) సుభాష్ చంద్రబోస్‌తో గడిపిన క్షణాలు.

కేవలం భక్తి వుంటే సరిపోదు. దేశ భక్తి చాలా అవసరం. భక్తి వైయుక్తికం. దేశభక్తి అనేది జాతీయోద్యమ స్ఫూర్తి. అందుచేత గాంధీ, తిలక్, భగత్ సింగ్ దేశభక్తితో జాతీయోద్యమాన్ని నడిపారు. స్వాతంత్ర్యాన్ని తీసుకువచ్చారు. సాంఘిక చైతన్యాన్ని పెంపొందించి నేటి జాతీయోద్యమ లక్ష్యాలను సాధించుకోవాలి. దేశంలో ఈ నాటికీ దారిద్ర్యం, కుల మతాలు, నిరుద్యోగం పోలేదు. బాల కార్మిక వ్యవస్థ పోలేదు. భారత రాజ్యాంగ లక్ష్యం నెరవేరలేదు. నేటి యువతరానికి దేశభక్తి, సాంఘిక చైతన్యం అలవరచవలసిన కర్తవ్యం దేశభక్తులందరి మీదా వుంది. గాంధీ, భగత్‌సింగ్ ఆశయాలను నెరవేర్చాలి. ఈనాడు పదవులు, ధనకాంక్ష ప్రబలిపోయాయి. అవినీతి, అక్రమ సంపాదన అధికమైంది. వీటికి వ్యతిరేకంగా దేశభక్తులందరూ మరో స్వాతంత్ర్య పోరాటాన్ని నిర్వహించాలి. జాతీయోద్యమ త్యాగ సాంప్రదాయాలు, నైతిక విలువలు పునరుద్ధరించాలి. ఇది ప్రతి భారతీయుడి కర్తవ్యం. విద్యాలయాలలో జాతీయోద్యమ చరిత్ర, సమర యోధుల జీవిత చరిత్రలను పాఠ్యాంశాలుగా ప్రవేశ పెట్టాలి.

ఈ సంచికలో....

టపా	...	2
సమ్‌థింగ్ స్పెషల్	...	3
సీరియల్	...	8
తెలుసుకుందామా...	...	10
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
ఆరోగ్యం	...	20

ఇంకా...

చూద్దామా ... 4
జంట హిల్ స్టేషన్లు లోనావలా, ఖండాలా

మంచిపుస్తకం ...6
అస్తిత్వానికి ఆరంభం ఆశయాలకు ఆలంబం

సినిమా	...	22
రుచి	...	23
మనసా... తెలుసా	...	24

కథ ... 18
నాగులు తిరిగే కోనలో....



ఫాల్కే కబుర్లు ఆసక్తికరం

ఏప్రిల్ చివరి ఆదివారం స్నేహ సంచికలో అట్టమీది కథగా... అందించిన 'భారతీయ చలన చిత్ర ఆది గురువు' ఫాల్కే...ఎంతో ఆసక్తికరంగా ఉంది. ఫాల్కే గురించి అనేక విషయాలను మా అందరికీ తెలియ జేశారు. "విజ్ఞాన వీచిక" ద్వారా కొత్త మరుగుజ్జు జాతి విషయాలను గ్రహించగలిగాం. "చూస్తుండగానే చవులూరెనులే" అంశంలో నలభీములు చేయటమే ఆలస్యం చాలా మంది బకాసురులు లొట్ట లేసుకుంటూ లాగించేయటం సంగతేమోగాని విదేశాల్లో 'ఎద్దు'కు దాపురించిన దుస్థితికి మేము ఖిన్నులమయ్యాం. "చూద్దామా"లో మంచు బంగారు లోకం ఊటీ విశేషాలు... ఒక అద్భుతమైన, అంద మైన సుందర ప్రాంత సందర్శన భాగ్యం కలిగినంత ఆనందం కలిగింది.

అపరిశుభ్రమైన ఆహారం వల్లనే, అనేక సమస్యలు తలెత్తు తాయనీ 'ఆరోగ్యం' ద్వారా అవగా హన చేసుకున్నాం. మార్పు రావాలంటే పోరాటం తప్పదంటున్న, ఈ వారం అతిథి మూకిరి జాన్ మాణిక్యరావు గారి మనోగతంతో మేమూ శృతి కల్పుతున్నాం.

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం టౌన్-1.

యువతను హెచ్చరించిన కథ

ఫాల్కే చలన చిత్రరంగానికి చేసిన కృషిని తెలియచేసినందుకు అభినందనలు. కాగితం పువ్వు కథానికలో ఎయిడ్స్ రోగి జీవితకథ సమాజానికి ఒక హెచ్చరిక. దురలవాట్లకు గురి కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఎయిడ్స్‌కు అశ్లీల, చిత్రాలు, పబ్ సంస్కృతి, వ్యాపార ప్రకటనలు కారణాలు. "మన అతిథి" శీర్షిక యువతకు స్ఫూర్తిదాయకం.

టి. శ్రీరామమూర్తి,
గాజువాక, విశాఖపట్నం.

మంచి జోక్స్ ఇవ్వండి

అట్టమీది కథలో భారతీయ చలన చిత్ర ఆది గురువు (ధుండిరాజ్ గోవింద్ ఫాల్కే) అలనాటి విశేషాలు అందించినందకు అభినందనలు. అలాగే, ఫాల్కే అవార్డు అందుకున్న మహానీయులు మంచి మంచి సినిమాలు తీసి ప్రేక్షకుల హృదయాల్లో వెలుగొం దాలని కోరుకుంటున్నాము. ఇంత చక్కని విషయాలు తెలియ జేసిన డా॥జె.పి. వైద్య గార్కి ధన్యవాదాలు. అలాగే ఈ వారం బాలీవుడ్ స్టార్స్ ముద్దు పేర్లు తెలుసుకున్నాం. ఇంకా మంచి జోక్సు అందించాలని కోరుకుంటున్నాం.

అనుపోజు సత్యనాగరాజు,
రాజీవ్ నగర్ కాలనీ,
విజయనగరం.

మరుగుజ్జుల గురించి తెలుసుకున్నాం

అట్టమీది కథ ద్వారా ఫాల్కే సినీ జీవితం గురించిన ఎన్నో విషయాలను తెలుసుకున్నాం. భార తీయ చలన చిత్ర నిర్మాణంలో ఆద్యుడిగా ప్రత్యేక స్థానం పొందిన "ఫాల్కే" జీవితం ఎంతో మందికి ఆదర్శనీయం. అలాగే 'ఆరోగ్యం' శీర్షికలో ఈ వేసవి ఎండలలో ఆహారం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుసుకున్నాం. ప్రతీ ఒక్కరికీ ఉపయోగకరమైన విష యాలను తెలియజేశారు. "అమెరికన్ దేగ" సీరియల్‌ను త్వరగా ముగిస్తే బాగుంటుందనిపిస్తుంది. "విజ్ఞాన వీచిక" శీర్షికలో కొత్త మరుగుజ్జు జాతి గురించిన విశేషాలను తెలుసుకున్నాం. వారి ఎత్తు, బరువును గురించి చదివి ఎంతో ఆశ్చర్యపోయాం. చూద్దామా శీర్షికలో 'ఊటీ'లోని దర్శనీయ స్థలాలను గురించీ ఎన్నో విషయాలను తెలుసుకున్నాం.

గొల్లమంద సురేష్‌కుమార్,
సీతారాంపురం, ఖమ్మం.

ఎద్దు మాంసం కూర తినకుంటే ఏం?!

ఊటి ఊహాలోకాల్లోకి తీసుకెళ్ళింది. ముద్దు పేర్ల పురాణం చిత్రంగా వుంది. డ్రై ఫ్రూట్స్ షేక్, పుచ్చ ఐస్‌క్రీమ్ బాగుంటాయి. మొద్దుగాడి ఎద్దు మాంసం కూర తినకుంటే ఏం మునిగిపోతుంది? అడుసు తొక్కనేల కాలు కడగనేల అన్నట్లు అపరిశుభ్ర ఆహారం ఎందుకు తినాలి?

వాస్తు రామచంద్ర,
రాంజీనగర్, నెల్లూరు.

నిజంగానే స్పెషల్

ఆదివారం అనుబంధం స్నేహలో ప్రచురించిన సమ్‌థింగ్ స్పెషల్‌లో 'గుడ్ల మీద నడుస్తూ కారు లాగగలరా' బాగుంది. విశ్వానికి మరో పేరైన కుక్క చంటిపాపని చూసి తీసుకొని వెళ్ళి, కుక్కకు విశ్వాసం ఎక్కువగా ఉంటుందని నిరూ పించింది. ఓ ఎలుగుబంటి కర్ర సాము చెయ్యడం మరో విశేషం. ఇంత చక్కటి తమాషా విష



యాలు తెలియజేసిన సాహిల్‌కి అభినం దనలు.

నామగిరి నాగేశ్వరరావు,
గాజువాక.

ఉపయోగపడే ఆరోగ్యం వివరాలు

అతిథి మాణిక్యరావు గారి విశ్లేషణలో అర్థముంది. మన అతిథి శీర్షికన ప్రతివారం ఓ అతిథి మాతో ముచ్చటిస్తున్న తీరు అద్భుతం. వేసవిలో శుభ్రమైన నీళ్ళు తాగటం మంచిది అంటూ విలువైన సత్యాలను మా చేతిలో పెట్టి మంచి ఆరోగ్యాన్ని సంపాదించు కోవాలంటూ ప్రచురించిన ఆర్టికల్ చాలా బాగుంది. ఊటీలో చూడాల్సిన స్థలాలు, సూచనలు ఫొటోలతో సహా చక్కగా ప్రచురించిన విధానం చాలా బాగుంది. 'గుడ్ల మీద నడుస్తూ కారు లాగగలరా!' చదివి ఆశ్చర్య పోయాం. అలాగే విశ్వాసానికి మారు పేరు, ఇలా కర్ర తిప్పగలరా కూడా బాగున్నాయి. విజ్ఞాన వీచికలో కొత్త మరుగుజ్జు జాతి అంటూ 'విజ్ఞాన వీచిక' అనునిత్యం సరికొత్త విషయాలను వెలుగులోకి తెస్తోంది. జి.ఎల్. నరసింహారావు గారి సలహాలు చాలా బాగున్నాయి.

కర్రా వర ప్రసాద్,
యలమర్రు, కృష్ణా జిల్లా.



ఆహ్వానం

మీరు జోక్స్ బాగా వేస్తారా! వాటిని విన్న మీ స్నేహి తులు, సహోద్యోగులు, ఇరుగు పొరుగు పడీపడీ నవ్వుతారా! మరైతే ఇంకా ఆలోచిస్తున్నారేంటండీ బాబూ. మా పాఠకులను కూడా మీ జోక్స్‌తో కడుపుబ్బా నవ్వించ చండి. గిలిగింతలు పెట్టండి. మీరు రుచి కరమైన వంటలు, అల్పా హారాలు, పానీయాలు... చేస్తుంటారా. వెజ్, నాన్ వెజ్ కూరలు వెరైటీగా చేస్తుం టారా. వెంటనే ఓ కాగితం, పెన్నూ తీసుకోండి. మీరు మాకు పంపదల చుకున్న వంటకానికి కావాల్సిన పదార్థాలు, కొలతలు, వండే విధానం వివరంగా రాసి మాకు పంపండి. ప్రచురిస్తాం.

మా చిరునామా: ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి,
స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్-20.

బుల్లి చెస్ బోర్డ్

ఎస్.కె. అయూబ్, నల్గొండ.



చెస్ బోర్డును తయారుచేస్తున్న పోలోజు నర్సింహాచారి

ఆ యువకుడికి ఒకటే ఆలోచన. ఏదైనా వెరైటీగా చేసి రికార్డు సృష్టించాలని ఒకటే తపన. చాలామందిలా ఆలోచనలకే పరిమితం కాకుండా ఖాళీ సమయాల్లో తన సృజనకు పదును పెట్టాడు. 1.80 మిల్లీ మీటర్ల వ్యాసం గల చదరంగం బోర్డు తయారు చేయడంలో విజయం సాధించాడు. చూపుడు వేలిమీద పెట్టుకుని జాగ్రత్తగా పరిశీలిస్తే తప్ప అది చెస్ బోర్డని అర్థంకాదు.

'ఇంతకీ ఈ యువకుడు ఎవరా?!' అనుకుంటున్నారు కదూ. అక్కడికే వస్తున్నామండీ బాబూ..

అతనే నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన పోలోజు నర్సింహాచారి. మరి ఆ బుజ్జి చదరంగం వివరాలేంటో తెల్సుకుందామా...

ఏదో సాధించాలనే తపనే అతి చిన్న చదరంగం (చెస్) బోర్డు తయారు చేసేందుకు దోహదం చేసింది. 6 నెలల క్రితం తన మెదడుకు పదును పెట్టిన నర్సింహాచారి మొట్టమొదటిసారిగా 16 మిల్లీమీటర్ల చదరంగం బోర్డును తయారు చేశాడు. తర్వాత రెండవసారి 8 మిల్లీమీటర్ల చదరంగం బోర్డును రెండు నెలల్లోపే తయారు చేశాడు. ఆ తరువాత 4 మిల్లీమీటర్లతో కాయిన్స్‌తో సహ చదరంగం బోర్డును మూడవసారి తయారు చేశాడు. గిన్నిస్‌బుక్‌లో స్థానం సంపాదించాలనే లక్ష్యంతో ముందుకెళ్లిన నర్సింహాచారి, తర్వాత 2 మిల్లీమీటర్ల చదరంగం బోర్డును తయారు చేసి వార్తల్లోకి ఎక్కాడు. ఆ తర్వాత అరగంటలో 1.80 మిల్లీమీటర్ల బోర్డును తయారు చేశాడు.

ఇంతకీ నర్సింహాచారి వ్యక్తిగతం ఏంటో...!

అతని తల్లిదండ్రులు ఐదు సంవత్సరాల క్రితం చనిపోయారు. మేనమామ శ్రీపాదబ్రహ్మాచారి ఇంట్లో ఉంటూ, పార్ట్‌టైం జాబ్ చేసుకుంటూ బిటెక్ చదువుతున్నాడు. ప్రతిరోజూ సాయంత్రపు వేళల్లో ఎలక్ట్రీషియన్, సైకిల్ మెకానిక్ పనులు, స్థానిక కాకతీయ కాన్సెప్ట్ స్కూల్‌లో పార్ట్ టైం జాబ్ చేస్తూ తన చదువుకు అవసరమైన ఫీజులను సంపాయించుకుంటున్నాడు. మిత్రుల సహకారం, బంధువుల ప్రోత్సాహం, ఏదో సాధించాలనే తపన తనను 1.80 మిల్లీమీటర్ల చదరంగం బోర్డు తయారు చేసేందుకు దోహదం చేసిందని నర్సింహాచారి అంటున్నారు.

ఇంకా ఏం సాధించాలనుకుంటున్నాడో...

'ప్రభుత్వం నాకు అన్ని విధాల సహకారం అందిస్తే సైకిల్‌కు ఎలక్ట్రానిక్ మోటర్‌ను తయారు చేసి అమర్చేందుకు సిద్ధంగా ఉన్నాను. గిన్నిస్‌బుక్‌లో నా పేరు రావాలి. అదే నా మొదటి లక్ష్యం. ప్రభుత్వం సాయం చేస్తే ఇతర దేశాల్లో బిటెక్ పూర్తి చేసుకొని మరిన్ని కొత్త పరికరాలు తయారు చేసి దేశ ప్రజలకు సేవ చేస్తా. ప్రస్తుతం మరో మూడు కొత్త వస్తువులను తయారు చేస్తున్నా. త్వరలోనే వాటిని మీ ముందుంచుతా..' అంటున్నాడు నర్సింహాచారి.

❄

ముదురు

టైమ్ వేస్ట్ చేయడమెందుకని....!?

మరీ అంతగా ఆశ్చర్యపోకు బాస్?!

పోల్ డాన్స్ అంటే ఇదే.

ఇంతకీ నేను బాగా చేస్తున్నానా లేదా!



యాజీవ్

జంట హిల్ స్టేషన్లు లోనావలా, ఖండాలా

భారత దేశంలోని సుందరమైన ప్రదేశాలు మెండుగా ఉన్న ప్రదేశం పూనా. మహారాష్ట్రలోని ఈ ప్రదేశం జలపాతాలతో, కొండా కోనలతో పచ్చగా, చూడ ముచ్చటగా కనిపిస్తుంది. మొత్తం పూనాలో 'లోనావాలా' మరింత సుందర ప్రదేశం. దీనికి దగ్గరలోనే 'ఖండాలా' అనే మరో హిల్ స్టేషన్ ఉంది.



ముంబై, పూనా హైవేకి ఇరువైపులా, ఐదు కిమీ దూరంలో ఈ రెండు హిల్ స్టేషన్లు ఉన్నాయి.

1871లో, అప్పటి బాంబే ప్రెసిడెన్సీ గవర్నర్, సర్ ఎల్ఫిన్స్టోన్ కనుగొన్న లోనావలా కళ్ళారా చూసి మనసారా అనుభవించవలసిందే తప్ప ఎంత వివరించినా తక్కువే అనిపించే ప్రకృతి సౌందర్యం గల ప్రదేశం. లోయలు, జలపాతాలు, కొలనులు, కొండలు ఎటు చూసినా పచ్చదనంతో అత్యంత ఆహ్లాదకరమైన ప్రదేశం. లోనావలా సముద్ర మట్టానికి 625 మీటర్ల ఎత్తులో ఉంది. సహ్యాద్రి పర్వత శ్రేణుల్లో ఉన్న లోనావలా పేరు "లోనావ్లి" అనే పదం నుండి వచ్చింది. 'లోనావ్లి' అంటే 'గుహలతో చుట్టుముట్టబడిన' అని అర్థం. ఇక్కడ ప్రాచీన బౌద్ధ గుహలు-భాజా, కార్లా- ఉన్నాయి. లోనావలా పూనాకి 64 కిమీ దూరంలో ఉంది. ముంబై నుండి వస్తే110 కిమీ దూరంలో ఉంది.

ఖండాలా, లోనావలా కంటె కాస్త తక్కువ ఎత్తులో ఉన్నా సౌందర్యంలో మాత్రం తక్కువ కాదు. చాలా మంది లోనావలాలో బస చేసి ఖండాలాకి వెళ్ళివస్తుంటారు. లోనావలాలో ఎక్కువ లాడ్జీలు, మంచి మార్కెట్లు ఉన్నాయి.

ఈ ప్రాంతాలలో సన్సెట్ పాయింట్, మంకీ పాయింట్, లయన్ పాయింట్, టైగర్ లీప్, బుషీడామ్, బోలెడన్ని కోటలు, గుహలు ఉన్నాయి. వీటి మధ్యలో అనేక జలపాతాలు కనువిందు చేస్తుంటాయి.

ఖండాలాలో ఛత్రపతి శివాజీ కోట-రాజ్మచీ ఉంది. దీని ఎదురుగా రాజ్మచీ పాయింట్ ఉంది. ఇక్కడి నుండి అనంతమైన ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించవచ్చు. పొగమంచుతో కప్పబడ్డ లోయలు, జలపాతాలు అద్భుత మనిపిస్తాయి. ఇక్కడ ఎరువు కూడా ఉంది. దగ్గరలోనే రాక్ గార్డెన్, టైగర్ లీప్, సన్సెట్ పాయింట్ కూడా ఉన్నాయి.

ఖండాలాలోనే ఒక 800 అడుగుల భారీ ఏకశిలా సహజ నిర్మాణం ఉంది. ఇది పాము పడగలా ఉండే కొండ. దీనిని 'నాగఫణి' లేదా 'డ్యూక్స్ నోస్' అని పిలుస్తారు. స్థానికులు పెట్టిన పేరు







నాగఫణి. బ్రిటీషు వారు పెట్టిన పేరు డ్యూక్ నోస్. అప్పటి వెల్లింగ్టన్‌కి డ్యూక్‌గా ఉన్న వ్యక్తి ముక్కు ఈ కొండని పోలి ఉండటం వల్ల ఆ పేరు వచ్చింది. దీని పైన మహాదేవ దేవాలయం ఉంది.

టైగర్ లీప్/వాగ్దరీ

ఈ కొండ అంచు ఒక పులి లోయలోకి దూకుతున్నట్టుగా ఉంటుంది. ఇక్కడి నుండి లోనావలా పట్టణం అందంగా కనిపిస్తుంది. చాలా కొండలలాగే ఇక్కడ కూడా ఒక 'ఏకో పాయింట్' (ప్రతిధ్వని ప్రదేశం) ఉంది.

మంకీ పాయింట్ అనే మరో ప్రదేశం ఉంది. ఇక్కడ అనేక కోతులు ఉంటాయి. రైల్లో దిగిన ప్రయాణికులు ఈ కోతులకి తినడానికి ఏమైనా ఇస్తుంటారు.

కూణె జలపాతాలు

దాదాపు ఏడాది పొడవునా... 100 అడుగుల పైనుండి జాలువారే జలపాతాలు ఇవి. వీటి కింద స్నానాలు చేయడం ఓ మధురా నుభూతి.

కర్లా, భాజా గుహలు

క్రీస్తుపూర్వం రెండవ శతాబ్దికి పూర్వం నుండి ఉన్నట్టుగా పేర్కొన్న అద్భుతమైన గుహలు ఇవి. ఇవి హీనయాన బౌద్ధమతానికి సంబంధించి నవిగా చెబుతారు. ప్రస్తుతం ఇవి పురావస్తు శాఖ వారి ఆధ్వర్యంలో ఉన్నాయి. సుమారు 150 మెట్లు ఎక్కి ఈ గుహల్ని చేరవలసి ఉంటుంది. అక్కడే ఒక గుడి కూడా ఉంది. ఇంకా ఇక్కడ శ్రీవర్ధన్ కోట, మనోరంజన్ కోట, లోహగఢ్ కోట, విసాపూర్ కోట, రాజ్ మచి కోట, తుంగి కోట ఉన్నాయి. వీటిలో చాలా వరకు శిథిలమైపోయినా ఇంకా చూడదగ్గవే.

సంవత్సరం పొడవునా ఈ ప్రదేశాలు అందంగానే ఉన్నా వర్షాకాలంలో మాత్రం అత్యద్భుతంగా ఉంటాయి.

సినిమా షూటింగులు, కొత్తగా పెళ్ళైన దంపతులతో నిత్యం హడావిడిగా ఉండే ఈ జంట హిల్‌స్టేషన్‌న్లు తప్పకుండా చూడవలసిన ప్రదేశాలు.



మరో మాట

పూనా మామూలుగానే ఆరోగ్యవంత మైన ప్రదేశం. కాస్త స్వచ్ఛమైన కొండగాలి... ప్రశాంతమైన వాతావరణం... సుందర దృశ్యాలు... ఎటువంటి అనారోగ్యాన్నైనా దూరం చేయగలవు అన్నట్టుంటాయి.

పర్యావరణాన్ని కాపాడదాం

పర్యాటక స్థలాలు పాడైపోవడానికి కారణం సగం పర్యాటకులే! విచక్షణా రహితంగా ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లు, బ్యాగులు ఎక్కడపడితే అక్కడ పారవేయడం, తినుబండారాలు వదిలివే యడం మూలంగా అందమైన ప్రదేశాలు దూరం నుండే అందంగా కనిపించే పరిస్థితి వచ్చింది. 'ఆ' పర్యాటకుల్లో 'మనం' ఉండకూడదు. అది దృష్టిలో పెట్టుకోండేం!



'చిక్కీ' రుచి చూడడం మరువద్దు

సాధారణంగా పర్యాటక స్థలాల్లో 'తిండి' కి ఎప్పుడూ కొరత ఉండదు గాని ఏదో లోపమైతే కనిపిస్తుంది. లోనావలాలో 'చిక్కీ'లు (బెల్లం, పంచదారతో చేసిన పల్లీ, నువ్వుల అచ్చులు) చాలా ప్రసిద్ధమైనవి. అక్కడికి వెళ్ళిన వాళ్ళందరికీ ఇట్టే తెలిసిపోయే విషయమే అయినా- వాటిని రుచి చూడటం మర్చిపోవద్దు!



కథా నిలయం
శ్రీకాకుళం

ఓ మంచి పుస్తకం

అస్తిత్వానికి ఆరంభం

ఆశయాలకు ఆలంబం

తెర

ప్రపంచ సాహిత్యంలో దానితో పోల్చదగిన పుస్తకం మరొకటి లేదు. సరిహద్దు రేఖలనూ, తరాల అంతరాలనూ అధిగమించి దేశ దేశాల భిన్న కాలాల పాఠకులకు ప్రేరణగా నిల్చిన ఆ అద్భుత పుస్తకమే 'అమ్మ'.

'అమ్మ' 1906లో తొలిసారి వెలువడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ కోట్లాది ప్రతులు వెలువడుతూనే వున్నాయి. తెలుగునాట కూడా దాని ప్రభావం అమోఘమైంది. మానవాళి అస్తిత్వానికి ఆరంభ వాచకం అమ్మే. అన్ని బాధలూ గాధలకు ప్రథమ ప్రత్యక్ష సాక్షి అమ్మే. అమ్మ పాత సమాజానికి ప్రతీక. దాని క్రమానుగత చైతన్య పతాక.

గోర్కీ అసలు పేరు అలెగ్జీ మాగ్జిమోవిచ్ పెష్కోవ్. 1868 మార్చి 14న జన్మించాడు.....

వ్యక్తిగా అనేక బాధలు పడ్డాడు. చిన్నప్పుడే తండ్రి చనిపోయాడు. దౌర్జన్య పూరితమైన తాతగారి పెంపకంలో పెరిగాడు. అయితే నానమ్మ చెప్పే కథలే అతనికి వూపిరి పోసేవి. తర్వాత కాలంలో ఆ ఇంట్లో వుండలేక పారిపోయాడు. మూటలు మోశాడు. చెత్తకుప్పల పక్కన గడిపాడు. ఈ దరిద్రంలోనూ, దుర్భర జీవితంలోనూ ఆయనకు ఒకే ఒక ఉపశమనం – తన వానాకాలం చదువుతో పుస్తకాలు చదవడం. తను చూసిన జీవితాన్ని కూడా రాయాలనుకున్నాడు. కాని అంతకంతకూ జీవితంలో వైరుధ్యాలు ఆయనను అశాంతికి గురి చేశాయి. భరించలేక ఒక కొండపైకి వెళ్లి తుపాకితో కాల్చుకున్నాడు. ఆ గుండు కొంచెం పక్కనుంచి తప్పిపోయింది. అప్పుడు మిత్రులు ఆదరించారు. ఆ దశలోనే ఆయనకు కొత్తగా పెంపొందుతున్న రష్యన్ కార్మికోద్యమంతో సంబంధమేర్పడింది. 1896లో ఆయన పావలోనా వోల్జినాను పెళ్లాడాడు. క్లర్కుగా పనిచేస్తూ ఖాళీ వేళల్లో 'మాగ్జిం గోర్కీ' అనే కలం పేరుతో కథలు రాయడం మొదలెట్టాడు. అతని రచనలు కొద్ది కాలంలోనే అందరినీ ఆకర్షించాయి. జారిస్టు ప్రభుత్వం ఆయనపై రాజద్రోహ నేరం ఆపాదించి ఖైదు చేసింది. ప్రజల నిరసనతో ఆయనను విడుదల చేయక తప్పలేదు.

ప్రపంచ కార్మికోద్యమానికి ప్రేరణ అయిన "అమ్మ"ను గోర్కీ సామ్రాజ్యవాద అమెరికాలో వుండగా రాశాడు. 1905 విప్లవం తర్వాత తన అరెస్టుకు వారంటు రావడంతో ఆయన విదేశాలకు తరలిపోయాడు. ఈశాన్య న్యూయార్క్‌లోని ఒక పెద్ద పర్వతశ్రేణిలోని క్యాబిన్‌లో కూచుని అమ్మ నవలలో చాలా భాగం పూర్తి చేశాడు. అది మొదట ఇంగ్లీషులో వెలువడింది. ఆలస్యంగా రష్యన్ భాషలోకి తర్వాత అనువాదమైంది. అమ్మ తొలి ముద్రణ రష్యాలో పెద్ద సంచలనమే రేపింది. దాన్ని ప్రచురించిన పత్రికను ధ్వంసం చేశారు. రెండవ భాగాన్ని పూర్తిగా తొలగించేలా వత్తిడిపెట్టారు.

అమ్మ నవల గోర్కీ జన్మస్థలమైన పాత నగరం నిజ్నినోవ్‌గ్రాడ్‌లో జరుగుతుంది. (ఆయన గౌరవార్థం 1932లో దానికి గోర్కీ అని పేరు పెట్టారు) ఒకా నది వోల్గా నదిలో కలిసే చోటు. అక్కడ పెద్ద రేవు, రైల్వే మార్గం కూడా. పెద్ద వ్యాపార కేంద్రమైనా అక్కడ ఒకే ఒక ఫ్యాక్టరీ వుండేది. అదే క్రాసినో సొర్మోవో నౌకా నిర్మాణ కేంద్రం. గోర్కీ దాన్నే తన నవలలో నమూనాగా తీసుకున్నాడు.ఆ కాలానికి రష్యాలో వేలాది మంది కార్మికులు వున్న ఒక ముఖ్యమైన కేంద్రం అది. అక్కడ 1902లో మేడే ప్రదర్శనను పోలీసులు చెదరగొట్టడమే కాక దానిలో పాల్గొన్నవారిపై కోర్టు విచారణ జరిపారు. ఇవన్నీ తనలో ఒక పుస్తకం రాయాలనే ఆలోచన కలిగించాయని, అప్పట్లోనే తాను ఆ ఘటనల వివరాలు సేకరించి రాసి పెట్టుకున్నానని గోర్కీ తర్వాత చెప్పారు. కనక ఆయన రచన పూర్తిగా కల్పన కాదు. కళ అద్దిన వాస్తవం.

ఈ ప్రదర్శనకు నాయకుడైన పోత్ జలమోవ్‌తో గోర్కీకి చాలా సన్నిహిత పరిచయం వుంది. అతన్ని దృష్టిలో పెట్టుకునే పావెల్ వ్లాసోవ్ పాత్ర రూపొందించాడు. ఇక అతని తల్లిగారే అమ్మ నీలోవ్నా (పావెల్‌కు ప్రాణమిచ్చిన ప్యోత్‌జలమోవ్ రష్యన్ విప్లవాన్ని సోషలిజం అభివృద్ధిని కళ్లారా చూసి 1955లో చనిపోయాడు. అతని తల్లి అమ్మకు మూల ప్రేరణ. అన్నా కిరిలోవ్నా కూడా విప్లవం తర్వాత చాలా కాలానికి 1938లో మరణించింది).

గోర్కీ లెనిన్‌ను కలుసుకున్నప్పుడు ఆయన 'మీ అమ్మ నవల పూర్తయిందా?' అని అడిగాడు. 'అయింది. అయితే కొంచెం హడావుడిగా పూర్తిచేయవలసి వచ్చింది' అని గోర్కీ జవాబిచ్చాడు. 'మంచిదే అయింది. ఇప్పుడు మనకు అలాటి రచన చాలా అవసరం. ఎందుకంటే సోషల్ డెమొక్రటిక్ ఉద్యమంలోకి వచ్చిన వారిలో చాలా మంది కొత్తవారు. వారికి పాత విషయాలు తెలియవు. ఈ పుస్తకం చదివి తెలుసుకుంటారు. దీన్ని లక్షల ప్రతులు ముద్రించి అందించాలి' అన్నాడు లెనిన్.

ఫ్యాక్టరీ యజమానులు కార్మికుల శ్రమను దోచుకోవడాన్ని వర్ణించే వాక్యాలతో 'అమ్మ' ప్రారంభమవుతుంది. తర్వాత అక్కడి జన జీవన దృశ్యాన్ని వర్ణిస్తుంది. "... ఇలా వుండీ వుండీ ఒక రోజు చనిపోయేవారు" అని ఆ వర్ణన ముగుస్తుంది. వారిలో ఒకటి పావెల్ కుటుంబం. తాగుబోతు తండ్రి మిహాయిల్ వ్లాసోవ్. అతని దాష్టీకాన్ని భరిస్తూ బతికే తల్లి నీలోవ్నా (ఆ దాష్టీకాన్ని ఖండిస్తూనే రోజంతా చాకిరీ చేసే ఆ కార్మికుడి ప్రవర్తనకు గల కారణాలను విశ్లేషించడంలో గోర్కీ వర్గ చైతన్యం ప్రదర్శిస్తాడు). ఇంతలో వ్లాసోవూ చనిపోతాడు.

తండ్రి దౌర్జన్యాన్ని ఎదుర్కొన్న పావెల్ తర్వాత ఒక రోజున తనూ తాగి వస్తాడు! అమ్మ మౌనంగా రోదిస్తుంది. తర్వాత అతను మారిపోతాడు. రాత్రిళ్లు ఆలస్యంగా రావడం మొదలెడతాడు. వస్తూ వస్తూ ఏవో పుస్తకాలు తెస్తుంటాడు. చాలా మృదువుగా మాట్లాడతాడు. తాము చక్రవర్తికి వ్యతిరేకంగా పనిచేస్తున్నామని చెబుతాడు. ఈ పుస్తకాలు చూస్తే జైల్లో పెడతారనీ అంటాడు. ఆ మాటలు వినగానే ఆమెకు వూపిరాడటం కష్టమైపోతుంది! పావెల్ మేము సోషలిస్టులం అన్నప్పుడు అమ్మ 'నీలోవ్నా! వాళ్లు చక్రవర్తిని చంపారు కదా' అని అడుగుతుంది. మేము అలాంటి పని

చేయవలసిన అవసరం లేదంటాడు పావెల్. 'నా బిడ్డ తప్పు చేయడు' అనుకుంటుంది అమ్మ. కొడుకు కోసం వచ్చే రకరకాల మనుషులూ, వారి మాటలూ, చేతలూ, చర్చలూ, వాదనలూ అన్నీ గమనిస్తూ వారికి అవసరమైనవి అమరుస్తూ వచ్చింది. అందులో అన్ని తరగతుల, తరాల ప్రతినిధులూ వున్నారు. రైతు రీబిన్, మేధావి వర్గానికి చెందిన నికోలాయ్ ఇవనావోచ్, పావెల్ అరెస్టు తర్వాత అతని స్థానాన్ని స్వీకరించి అనారోగ్యంతో కన్నుమూసే యెగోర్ వీరంతా పాతతరం వారే. యువ విప్లవ కారులలో మహిళలు గణనీయంగా వుంటారు. దూసుకు పోయే సోఫియా, పావెల్ స్నేహితురాళ్లు నటాషా, టాన్యా ఎవరూ పురుషులకు తీసిపోని విధంగా పనిచేస్తారు.

పాఠకులు నవలను అమ్మ కళ్లతోనే చూస్తారు. పావెల్ కామ్రేడ్లు కూడా ఆమెను అమ్మ అనడమే కాదు, పాఠకుడూ అమ్మ వెంట నడుస్తున్నాననుకుంటాడు. ఒక విధంగా అమ్మ అంటే సమాజమే.

అయితే విప్లవ పోరాటం కళ్యాణికమైంది కాదు. వ్యక్తిగత సాహసమూ కాదు. ఉద్వేగాలు లేని యాంత్రికతా కాదు. 'అమ్మ' లోని పాత్రల్లో ప్రేమలూ, వియోగాలూ, విషాదాలూ, వ్యాధులూ, బాధలూ వ్యక్తిగతమైన హెచ్చుతగ్గులూ అన్నీ చూస్తాము.

'మన పిల్లలే మన పాలిట న్యాయాధిపతులు' అని జైలులో తనను ఎకసెక్కం చేసిన అధికారికి అమ్మ ధైర్యంగా బదులు చెబుతుంది. తను పూజించే క్రీస్తు బోధనలను వారి కార్యాచరణలోనే చూసుకుంటుంది. చివరకు ఆధ్యాత్మికత కన్నా ఈ పోరాటాలే గొప్పవన్న నిశ్చయానికి వస్తుంది. గూఢచారుల కళ్లుగప్పి విప్లవ సాహిత్య ప్రచారంలో, సహాయక కార్యకలాపాలలో భాగం పంచుకుంటుంది.

చాలా చాలా ఘటనలు జరుగుతాయి. నిర్బంధాలు, సాయుధ భటుల దౌర్జన్యాలు, శిక్షలూ అన్నీ తట్టుకుంటుంది. చివరలో ఇలా చెబుతుంది:

'నా కొడుకు చెప్పిన మాటలను, నా రక్తంలో రక్తమూ మాంసంలో మాంసమూ అయిన నా కొడుకు మాటలను ఇతరులకు చెబుతుంటే నాకెంత సంతోషమో మీకు తెలిస్తేనా? నా ఆత్మను సమర్పిస్తున్నట్టే.

ఇదంతా చూస్తుంటే మానవుని కడుపున కొత్త దేవుడు అవతారమెత్తినట్టుగానే వుంది. ప్రతి ఒక్కటీ అందరికీ, అంతా ప్రతి ఒక్కడికీ. నేనా దృశ్యాన్నే చూస్తున్నాను. నిజం చెప్పాలంటే మనమంతా కామ్రేడ్లం. ఆత్మీయులైన బంధువులం. అందరమూ సత్యమనే తల్లి బిడ్డలం. కామ్రేడ్స్ అనే మాటను నాలో నేను స్మరించే సరికి వారు నా హృదయంలోంచి పొంగి వస్తుండడం నేనే వినగలుగుతున్నాను'.

నవల ముగింపు ఘట్టంలో పోలీసులు దౌర్జన్యం చేసినప్పుడు–

'రక్తపుటేర్లు పారించినా సత్యాన్ని ముంచేయలేరు' అని అమ్మ గర్జిస్తుంది.

ఆ గర్జన ఇప్పటికీ ప్రపంచమంతా మార్మోగుతూనే వుంది. 'అమ్మ' కావాలని అడిగే పాఠకులు అసంఖ్యాకం. ఇంటర్‌నెట్ చూస్తే అమ్మ నవలపై అపారమైన స్థాయిలో అభినందనా పూర్వకమైన అంశాలు కనిపిస్తాయి. దాన్ని యథాతథంగా అందించే సైట్లు లెక్కలేనన్ని. దాని సంపూర్ణ, సంక్షిప్త ప్రచురణలు ఎన్నో. ఇప్పటికీ వాటిని చదివిన వారు ఉత్తేజితులవుతూనే వున్నారు. ఎందుకంటే అమ్మ అంటే జీవితం. జీవిత పోరాటం.

మక్సీమ్ గోర్కీ
అమ్మ
"రాదుగ" ప్రచురణాలయం,
మాస్కో
అనువాదం: క్రొవ్విడి లింగరాజు ,పేజీలు: 388
ప్రతులకు :
ప్రజాశక్తి బుక్ హౌస్,
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ .









మూలం : బరీ మై హార్ట్ ఎట్ ఊండెడ్ నీ (డీ బ్రౌన్)

తెలుగు సేత: ముక్తవరం పార్ధసారథి

అమెరికన్ డేగ

జరిగిన కథ

వాలోవా వాలీ జోసెఫ్ అనుచరులదే అని ప్రకటించిన రెండేళ్లకే, అక్కడ తెల్లవాళ్లకు కూడా ప్రవేశముంటుందని ప్రకటించింది ప్రభుత్వం. మరి కొన్నాళ్లకు, నెజ్‌పెర్స్ అక్కడి నుండి లాప్వామ్ రిజర్వేషన్‌కు వెళ్లటానికి గడువు విధించింది. తన పూర్వీకులు 'వాలోవా'ను వదలటానికి నిరాకరించాడు జోసెఫ్. కాని 1877లో వన్ ఆర్మ్‌డ్ సోల్జర్ చీఫ్ జనరల్ హోవార్డ్ తన సైన్యాలతో వచ్చి నెజ్‌పెర్స్ ఆ ప్రాంతాన్ని తక్షణం ఖాళీ చెయ్యాలని ఆదేశించాడు.

(52వ భాగం)

ఆ సమావేశంలో వైట్ బర్డ్, లుకింగ్ గ్లాస్, తమ్ముడు ఆలోకాట్, వాలోవా మత గురువు టూహూల్, హూల్ జోట్‌లు జోసెఫ్‌కు సలహాదార్లుగా వ్యవహరించారు. మత గురువు పొడగరి, దళసరి మెడ, వికృతమైన మొహంతో ఎవరికైనా కోపం తెప్పించగలడు. పైగా నోరు మంచిది కాదు. "నరకం నుండి పారిపోయి వచ్చిన భీకర రూపుడు"

అని తెల్లవాళ్ళు అతణ్ణి వర్ణించారు. ఫోర్ట్ ల్యాపాక్ గార్డ్ హౌజ్ కెదురుగా వున్న మరొక చిన్న బిల్డింగ్‌లో తొలి సమావేశం జరిగింది. జోసెఫ్, ఈ టూహుల్ హూల్ జోట్‌ను నెజ్‌పెర్స్‌కు అధికారిక ప్రతినిధిగా నియమించారు.

"మాలో కొంత మంది భూమిని వదులుకోవటానికి అంగీకరించారు గాని నెజ్‌పెర్స్ (తెగ)గా మేం అంగీకరించలేదు. భూమి మా శరీరంలో ఒక భాగం. దీన్ని ఇచ్చేస్తే మేం ఆత్మహత్య చేసుకున్నట్టే" అన్నాడు మత గురువు.

"ప్రభుత్వం మీ కోసం ప్రత్యేకంగా రిజర్వేషన్ ఏర్పాటు చేసింది. అక్కడ అన్నీ సౌకర్యాలు వున్నాయి. మీరు వెళ్లక తప్పదు" అన్నాడు హోవర్డ్.

"భూమిని విడగొట్టడం ఎవరికి సాధ్యం? ఇది నాది, ఇది నీది అనుకోవటమేమిటి? ఇది మీరిచ్చిన భూమి కాదు గదా, మీరు తిరిగి తీసుకోవటానికి?" అంటూ గద్దించాడు టూహూల్ హూల్‌జోట్.

"నేను ప్రభుత్వం ప్రతినిధిని అంటే యునైటెడ్ స్టేట్ అధ్యక్షుని తరఫున అడుగుతున్నాను. ఈ దేశంలో ఎవరూ నా ఆజ్ఞల్ని వుల్లంఘించటానికి వీల్లేదు" అన్నాడు హోవర్డ్ కాస్త కోపంగా.

కాని మత గురువు తన వాదన వదలలేదు.

"మీరెక్కడో దూర దేశాల నుండి ఇక్కడికి వచ్చి భూమి మీదంటున్నారు. తరతరాలనుండీ ఇక్కడే వుంటున్న ఈ నేల మాదో, మీదో మీకర్థం కాదా? మేం భూమి పుత్రులం. మళ్ళీ ఇందులోనే కలసిపోతాం. ఈ నేల మా తల్లి. ఇది మా మతం, మా విశ్వాసం.

❖ ❖ ❖

"మత విశ్వాసాలను మీరు వదులుకోనక్కర్లేదు. కాస్త వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకొమ్మని కోరుతున్నాను. "నేల నా తల్లి" అంటూ ఇప్పటికి వందసార్లు వల్లించావు. అలాంటి మూర్ఖ విశ్వాసాలకు విలువలేదు. ఇది లౌకిక వ్యవహారం" అంటూ కటువుగా మాట్లాడాడు హోవర్డ్.

"నా దేశంలోనే నన్ను ఆ జ్ఞాపించే వాడెవడు?" అంటూ రెచ్చిపోయాడు టూహూల్ హూల్ జోట్.

ఈ వాదన తెగదు. తన అధికారం నిరూపించుకోవాలనుకున్నాడు హోవర్డ్. మతగురువును అరెస్టు చేసి గార్డ్ హౌజ్ లోనే లాకప్‌లో పెట్టాడు. ముప్పై రోజుల్లో నెజ్‌పెర్స్ అందరూ వాలోవా వ్యాలీ వదిలి వెళ్ళాలని ఆదేశాలు జారీ చేశాడు.

"మా తెగవాళ్ళెప్పుడూ మీతో స్నేహాన్నే కోరుకున్నారు. ఎందుకంత తొందరపడుతున్నారు? ముప్పై రోజుల గడువు అన్యాయం. మా పశువుల మందలు ఎక్కడెక్కడో తిరుగుతున్నాయి. అన్నీ తీసుకుని నెల రోజుల్లో తరలి పోవటం ఎలా సాధ్యపడుతుంది? ఆకు రాలు కాలం దాకా ఆగండి. అప్పటికి నదిలో నీళ్ల వుధ్ధృతి కూడా తగ్గి దాటటానికి అనువుగా వుంటుంది" అంటూ బతిమాలాడు జోసెఫ్.

"వీల్లేదు, నెల రోజులకు మించి ఒక్క రోజు - ఇక్కడ సైనికులు మిమ్మల్ని రిజర్వేషన్‌కు తరిమేస్తారు. మీ గుర్రాలు, పశువులు స్వాధీనం చేసుకుంటారు" అంటూ దూకుడుగా మాట్లాడాడు హోవర్డ్.

గత్యంతరం లేదని గ్రహించాడు జోసెఫ్. యుద్ధం చెయ్యటానికి తనవైపు వంద మంది కూడా మిగల్లేదు. సాయంత్రం వేట నుండి తిరిగి వచ్చేసరికి కొందరు సైనికులు అప్పటికే అక్కడ పోస్ట్ ఏర్పాటు చేసుకున్నారు. అర్ధరాత్రి అర్జెంటుగా సమావేశం ఏర్పాటు పరచి పశువులను తోలుకుని వచ్చి లాప్వాయ్ వెళ్ళిపోవాలని తీర్మానించారు.

తాము ఇంక వాలీ ఆఫ్ వైండింగ్ వాటర్స్‌కు తిరిగి వెళ్ళలేమని తెలుసు. లాప్వామ్‌లో సైనికులు తమను రక్షించటానికి వీక్షిస్తున్నారు. బతికుండాలంటే, మరో కంటికి తెలియకుండా కెనడా పారిపోవటమొక్కటే మార్గం. సియోలకు చెందిన సిట్టింగ్‌బుల్ ఇప్పటికే అక్కడికి చేరుకున్నాడు. ఎలాగైనా, లోలోట్రెయిల్ దాటి బిట్టర్ రూట్ మౌంటెన్స్ అధిగమించి కెనడా చేరుకోవాలి.

"వాళ్ళు వేలల్లో వస్తున్నారు. మనం వందల్లో వున్నాం. వాళ్ళు చీల్చి చెండాడే ఎలుగుబంట్లు. మనం భయంతో బిక్క చచ్చిన లేళ్ళలాంటి వాళ్ళం. మన ప్రాంతం చిన్నది. వాళ్ల దేశం పెద్దది. దేవుడిచ్చిన దాంతో తృప్తి పడ్డాం మనం. వాళ్ళు ప్రకృతిని కూడా ధిక్కరించి కొత్త సరిహద్దులు గీస్తున్నారు. ఇప్పుడు అరణ్యాలు, నదులు, పర్వతాల మీద కూడా అధికారం వాళ్లదే".

కాలి నడకన, అందరూ లాప్వాయ్‌కు బయల్దేరారు. పరాజయాన్ని సహించలేని యువకులు కొందరు యుద్ధం చేసి మరణిస్తే గౌరవప్రదంగా వుంటుందన్నారు. లాకప్ నుండి విదులైన టూహూల్ హూల్ జోట్, హోవర్డ్ నెత్తుటితోనే ప్రతీకారం తీర్చుకుంటున్నాడు. ఇవన్నీ ప్రగల్భాలే. అందర్నీ, ఓపిక పట్టమన్నాడు జోసెఫ్.

జనరల్ హోవర్డ్ పెట్టిన గడువు సమీపించటంతో, పశువుల మందల్ని ఎక్కడివక్కడే వదిలి హడావిడిగా తరలివెళ్ళారు నెజ్‌పెర్స్. పర్వతాలమీద కరిగిన మంచు ప్రవాహంలోకి వచ్చి చేరటంతో స్నేక్ రివర్ పొంగి దాటటానికి ఇబ్బందిగా వుంది. అతి కష్టం మీద, దున్నపోతు చర్మాలతో చేసిన తెప్పల మీద స్త్రీలనూ, పిల్లలనూ సురక్షితంగా దాటించగలిగారు గాని, పురుషులంతా ఈ పనిలో తలమునకలై వున్నప్పుడు తెల్లవాళ్ళు కొందరు దాడి చేసి వీళ్ల పశువుల మందల్ని దొంగిలించారు. వాటిని రక్షించుకునే ప్రయత్నంలో పశువులతో సహా నదిని దాటటానికి ప్రయత్నించిన నెజ్‌పెర్స్ ఆ నీటి వుధృతిలో కొట్టుకుపోయారు.

ఈ అనూహ్య పరిణామానికి కలత చెందిన తెగ నాయకులు, రాకీ కాన్యన్‌లో ప్రయాణం తక్షణం ఆపి, ఒక సమావేశం ఏర్పాటు చెయ్యమని జోసెఫ్‌ను కోరారు. టూహూల్‌జోట్, వైట్‌బర్డ్, ఆలోకాట్‌లు యుద్ధం అనివార్యమన్నారు. బతికితే బలుసాకు తినవచ్చన్నది జోసెఫ్ అభిప్రాయం. సమవుజ్జీలతో తలపడితే ఫరవాలేదు. అత్యాధునిక ఆయుధాలున్న తెల్లవాళ్లతో యుద్ధం చేసి నిష్కారణంగా చావటమెందుకు? యుద్ధం కోసం వువ్విళ్లూరుతున్న యువకులు 'జోసెఫ్ పిరికి పంద' అంటూ హేళన చేశారు.

కాన్యన్‌లో గుడారాలు వేసుకొని వుంటున్న సమయంలో ఒక రాత్రి కొందరు నెజ్‌పెర్స్ యోధులు వేట పేరుతో రాత్రంతా ఎక్కడెక్కడో తిరిగి వచ్చారు. వాళ్ళు ఒక్క తెల్లవాణ్ణైనా చంపలేదంటే ఎవరూ నమ్మరు. నిజానికి, వాళ్లు ఆ ఒక్కనాడే పదకొండుమందిని మట్టుబెట్టారు. తమ పశువులను దొంగిలించినందుకిది ప్రతీకారం.

శాంతికాముకులైన అందరు ఇండియన్ నాయకుల్లాగే, తెల్లవాళ్ల ఒత్తిడికీ, తనవాళ్ల ప్రతీకార వాంఛకు మధ్య నలిగిపోయాడు. నెజ్‌పెర్స్ ఆవేదనను అతడు అర్థం చేసుకోగలడు" తెల్లవాళ్లను చంపటం తప్పని నేనూ అంగీకరిస్తాను, కాని దీనికి వాళ్ల బాధ్యత కూడా లేదా? వాళ్ళ ఆదేశాల మేరకే మేం మోంటానా బయల్దేరాం. పదహారు మైళ్ళు నడిచాక, వైట్ బర్డ్ క్రీక్ వద్ద సైనికులు మా మీద దాడి చేశారు. ఇదే కదా యుద్ధానికి నాంది?" అంటూ తన వాంగ్మూలం రికార్డు చేశాడు జోసెఫ్.

తమ కన్నా రెట్టింపు సంఖ్యాబలమున్న తెల్లవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని, జూన్ 17నాడు, వైట్‌బర్డ్ కాన్యన్ వద్ద సుమారు మూడు వంత సైనికుల్ని వధించారు నెజ్‌పెర్స్. బెంబేలెత్తిన హోవర్డ్ దళాలు కాలికి బుద్ధి చెప్పాయి. పది రోజుల తర్వాత, అదనపు బలగాలతో వచ్చాడు జనరల్, కాని అప్పటికే పర్వతాలతో సురక్షిత స్థానాలకు చేరుకున్నారు నెజ్‌పెర్స్. అయితే పక్కా వ్యూహంతో ఇండియన్లను వేటాడిన హోవర్డ్, క్లియర్ వాటర్ (ఒకస్థలం పేరు) వద్ద ఛీఫ్ లుకింగ్ గ్లాస్ తలదాచుకున్నట్టుగా తెలుసుకున్నాడు.

అప్పటికి నెజ్‌పెర్స్ జనాభా ఏడువందలకు మించలేదు. అందులో 250 మంది మాత్రమే యుద్ధం చెయ్యగలరు. రెండు వేల గుర్రాలు, వైట్‌బర్డ్ కాన్యన్ వద్ద శత్రువుల నుండి స్వాధీనం చేసుకున్న రైఫిళ్లూ, మందుగుండు సామాగ్రి కూడా వాళ్ళు రక్షించుకోవాలి.

నెజ్‌పెర్స్ చరిత్రలో క్లియర్ వాటర్‌కు ప్రధాన స్థానమున్నది. వీరి పూర్వీకులు తొలుత వచ్చిన తెల్లవాళ్ళు లూయిస్, క్లార్కులకు యిక్కడే స్వాగతం పలికారు. ఈనాడు జోసెఫ్ అక్కడే సమావేశం ఏర్పాటు చేశాడు. తాము ఇంక వాలీ ఆఫ్ వైండింగ్ వాటర్స్‌కు తిరిగి వెళ్ళలేమని తెలుసు. లాప్వామ్‌లో సైనికులు తమను రక్షించటానికి వీక్షిస్తున్నారు. బతికుండాలంటే, మరో కంటికి తెలియకుండా కెనడా పారిపోవటమొక్కటే మార్గం. సియోలకు చెందిన సిట్టింగ్‌బుల్ ఇప్పటికే అక్కడికి చేరుకున్నాడు. ఎలాగైనా, లోలోట్రెయిల్ దాటి బిట్టర్ రూట్ మౌంటెన్స్ అధిగమించి కెనడా చేరుకోవాలి.

మోటానాకు వెళ్ళే దారిలో వుంటుంది బిట్టర్ రూట్స్. ఇదంతా వాళ్లకు సుపరిచితమైన ప్రాంతమే. వేట కోసం తరచుగా ఈ కొండల్లో గాలిస్తూనే వుంటారు. హోవర్డ్ సైనికుల కళ్లు గప్పి ముందుకు పోవటం కష్టమేమీ కాదు! జూలై 25 నాడు లోలోక్రీక్ దాటుతున్న ఇండియన్లలో కొందరికి, అమెరికన్ సైనికదళం కనిపించింది. సరిహద్దు దాటటానికి వీల్లేకుండా ముళ్లకంచె కడుతున్నారు వాళ్ళు.

తెల్లజెండా పట్టుకుని వెళ్ళి జోసెఫ్, లుకింగ్ గ్లాస్, వైట్‌బర్డ్ వాళ్ళ కమాండింగ్ ఆఫీసర్ కెప్టెన్ చార్ల్స్‌రాన్‌తో కరచాలనం చేసి క్షేమసమాచారాలడిగారు. క్యాంపులో రెండు వందల మంది సైనికులున్నారని చెప్పాడు కెప్టెన్.

'యుద్ధం మాకిష్టం లేదు. వెళ్ళిపోతున్నాం. మీరు అనుమతిస్తే ప్రశాంతంగా సరిహద్దు దాటతాం' అన్నాడు జోసెఫ్.

ఆయుధాలు కిందపడేసి అమెరికా వెళ్ళాలన్నాడు కెప్టెన్. వైట్‌బర్డ్‌కు కోపం వచ్చింది. ఆయుధాలు వదలమని చెప్పటానికి వీళ్లెవరు?

త్వరలో పశ్చిమ దిశ నుండి జనరల్ హోవర్డ్, తూర్పు నుండి కల్నల్ జాన్ గిబ్బన్ అదనపు బలగాలతో అక్కడికి చేరుకొన్నారు. ఇండియన్లను కబుర్లలో పెట్టి వాళ్ళకోసం నిరీక్షించాడు రాన్. "మీ అభ్యర్థనను పరిశీలిస్తాం. ఒక రోజు ఆగమన్నాడు. ఇండియన్లు అంగీకరించారు. రెండు రోజులు గడిచినా రాన్ ఏ విషయమూ తేల్చలేకపోయే సరికి నెజ్‌పెర్స్ యువకుల్లో అసహనం పెరిగింది.

జూలై 28 వుదయం, లుకింగ్ గ్లాస్, కొందర్ని వెంట తీసుకొని కాన్యన్ దాటటానికి సన్నాహాలు చేస్తున్నాడు. పశువులమందల్నీ, స్త్రీలను, పిల్లల్నీ పర్వతాలవైపు తరలించాడు జోసెఫ్. ఇది గమనించి, కెప్టెన్ రాన్ వీళ్లను నిరోధించటానికి ప్రయత్నించాడు గాని ఇప్పుడు ఆటంకాలు కలిగిస్తే పూర్తిస్థాయి యుద్ధంగా మారే అవకాశముందని గ్రహించి తన ప్రయత్నం విరమించుకున్నాడు.

హోవర్డ్ నుండి తప్పించుకున్నామని, ఇండియన్లు, కెనడా వెళ్ళటానికి బదులు దక్షిణంగా పయనించి బిగ్‌హోల్ వేట మైదానాలకు చేరుకున్నారు (గిబ్బన్ సైన్యం తమను వెంటాడుతున్నదని వాళ్లకు తెలియదు). 'తెల్లవాళ్ళు తమను ఇక్కడుండనిస్తే చాలు. రోజులు సుఖంగా గడుస్తాయి' అనుకొని గూడారాలు గూడా వేసుకున్నారు.

ఇంకా వుంది....

కథా నిలయం
శ్రీకాకుళం

డా॥ కాకర్లమూడి విజయ్

నర్సు వృత్తిని ఒక గౌరవప్రదమైన పనిగా, ప్రత్యేకించి స్త్రీలకు గౌరవాన్ని తెచ్చే పనిగా ఒక ఉన్నత స్థానాన్ని కల్పించిన వనిత ఫ్లోరెన్స్ నైటింగేల్. నైటింగేల్ తన జీవితంలో అత్యధిక భాగాన్ని మిలిటరీ ఆస్పత్రులలో రోగులకు సేవలందించడానికే వెచ్చించింది. ఎనలేని సేవలు అందించింది. అందుకే ఆవిడ పుట్టిన రోజును నర్సుల దినోత్సవంగా జరుపుకుంటాం.

నర్సులందరికీ నిలువెత్తు ఆదర్శం నైటింగేల్

అన్ని వృత్తులలో కెల్లా ఉన్నతోన్నతమైన వృత్తి వైద్యం. అనారోగ్యాలు, వ్యాధులు, అవయవాల సమస్యలు కేవలం మందులకే లొంగకపోవచ్చు. చాలా సార్లు అనారోగ్యంతో పడి వున్న వ్యక్తికి సహాయం, తోడు అవసరం. అటువంటి వ్యక్తి ఆసుపత్రిలో వైద్య పర్యవేక్షణలో ఉంటే కుటుంబ సభ్యులు వ్యక్తిగతంగా చూడటానికి అన్ని వేళలా వీలుకాకపోవచ్చు. ఆ లోపాన్ని పూరించే వారే నర్సులు. మంచాన పడ్డవారి సొంత మనుషులు సైతం విసుక్కునే, ఈసడించుకొనే, అసహ్యించుకునే, భయపడే, బెరుకుపడే పనులను కూడా నర్సులు చేయవలసి వస్తుంది. అయినా వాళ్లెవరూ వెనుకంజ వేయకుండా ఆ సేవలు చేస్తూండటం చూస్తే వాళ్లు ఎంతో గొప్పగా సేవలు అందిస్తారో అర్థమౌతుంది. అలాంటి నర్సు వృత్తికే వన్నె తెచ్చిన ఫ్లోరెన్స్ నైటింగేల్ గురించి తెలుసుకుందాం.

తల్లిదండ్రులు వద్దంటే వద్దన్నారు

ఫ్లోరెన్స్ నైటింగేల్ అసలు పేరు నైటింగేల్. 1820 మే 12న ఆమె ఫ్లోరెన్స్ పట్టణంలో జన్మించింది కాబట్టి ఆ పట్టణ పేరుని కూడా ఆమె పేరుకి జతపర్చారు. 17 ఏళ్ళ ప్రాయంలోనే నైటింగేల్‌కు ఏదో రకంగా సేవకి అంకితమవ్వాలని అనిపించేది. నైటింగేల్ తల్లిదండ్రులు ధనవంతులు, గౌరవ ప్రదమైన కుటుంబ నేపథ్యం ఉన్నవారు. తమ కుమార్తె 'సమాజసేవ' అభిలాషను వారు ముందు నుండే నిరుత్సాహపరుస్తూ వచ్చారు. క్రమక్రమంగా నైటింగేల్‌కి నర్సింగ్ పట్ల మనసు మళ్ళింది. మానవ సేవ చేయడంలో నిస్సహాయులైన మానవులకి సేవ చేయడం మరింత మెరుగైనదని ఆమె భావించింది. కానీ ఆమె తల్లిదండ్రులు మాత్రం తమ స్థాయికి అసలేమాత్రం తగని వృత్తి అనీ, అందునా స్త్రీలకు ఏ మాత్రం ఈ వృత్తి పనికిరాదని వాదించారు.

ఆ రోజుల్లో నర్స్ వృత్తి అంటే పేదవాళ్ళు, పనికిరాని వాళ్ళు చేసే పనిగా పరిగణించేవారు. అసలు నర్సులంటే 'వంటవాళ్ళు'గానే ఎక్కువ పని చేసేవాళ్ళు. అటువంటి 'తక్కువ' స్థాయి పనికి నైటింగేల్‌ని ఎట్టి పరిస్థితులలోనూ పంపేదిలేదని ఆమె తల్లిదండ్రులు తెగేసి చెప్పేశారు. కాని నైటింగేల్ మనసు మారలేదు.

నైటింగేల్ తల్లి మాత్రం తన కూతురి వైఖరిని ఏ మాత్రం సమర్థించలేదు. ఆమె తన పిల్లల్ని 'పెద్ద' వాళ్ళ పార్టీలకీ, ఫంక్షన్లకీ తీసుకెళ్లేది. ధనిక కుటుంబాల నుంచి ఎన్ని సంబంధాలు తెచ్చినా నైటింగేల్ మాత్రం ఎటువంటి ప్రలోభాలకి లొంగలేదు. ఆమెకి ఎప్పుడూ పేదలపట్ల ఆదరణ, సేవా భావం ఉండేవి. తన తండ్రి ఎస్టేట్ లోని పనివాళ్లకి అనారోగ్యం కలిగితే, వారికి సేవ చేసేది. తన ఇంటికి వచ్చిన చుట్టాలు, స్నేహితుల చంటి పిల్లలను జాగ్రత్తగా చూసుకొనేది.

ఎట్టకేలకు తనకు నచ్చిన నర్స్ వృత్తి స్వీకరించింది

చివరికి ధైర్యం చేసి జర్మనీలో నర్సింగ్ ట్రైనింగ్‌లో చేరింది. ఆ తరువాత పారిస్‌లో చదివింది. తన 33వ ఏట లండన్‌లోని ఒక స్త్రీల ఆస్పత్రిలో సూపరింటెండెంట్ అయింది.

యుద్ధంలో... అలుపులేని సైనికుడిలా...

1854లో గ్రేట్ బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు కలిసి రష్యాపై యుద్ధానికి దిగాయి. క్రిమియాలో జరిగిన ఆ యుద్ధంలో బ్రిటిష్ సైనికులు చాలా మంది చనిపోయారు. సరైన సదుపాయాలు, సరుకులు ఇవ్వకుండా సైనికులను యుద్ధానికి పంపినందుకు బ్రిటిష్ ప్రజలు సహించలేకపోయారు. చేసేదేమి లేకపోయినా, కనీసం అక్కడ గాయపడ్డ బ్రిటీష్ సైనికులకు సేవలందించడానికి నర్సులను పంపాలని నిర్ణయించారు. సరైన వ్యక్తి కోసం అధికారులు వెదికి వెదికి చివరికి లండన్ ఆసుపత్రిలో నైటింగేల్‌ని కనుగొన్నారు. వెంటనే ఆమెని, ఆమెకి సహాయకులుగా మరో 38 మంది నర్సులను క్రిమియాకి తరలించారు.

1854, అక్టోబర్ 21న నైటింగేల్ బృందం అక్కడికి చేరింది. శిథిలావస్థలో వున్న బారక్‌లు, శుచీశుభ్రత లేని, ఎలుకలతో నిండిన కొట్టాల వంటి గదులలో నైటింగేల్ పని చేయవలసి వచ్చింది. గాయపడిన వారిని నేలపైనే పడుకోబెట్టవలసి వచ్చింది. తగినన్ని బెడ్‌లు, బ్యాండేజ్‌లు, టవళ్లు, కనీసం సబ్బులు కూడా లేవు. అక్కడి సైనికుల మరణాలకు కారణం పోషకాహార లోపం, పారిశుధ్య లోపమని నైటింగేల్ గ్రహించింది.

నైటింగేల్ వెంటనే పనికి ఉపక్రమించింది. కాస్త ఆరోగ్యంగా ఉన్నవారిని గది శుభ్రంచేయడానికి పురమాయించింది. వంట గది, గాయాలపాలైన వారికి సరైన ఆహారం, పారిశుధ్యం వంటి పనులన్నీ చక్కబరిచింది. రాత్రి వేళల్లో చేతిలో దీపంతో దాదాపు 6 కిలోమీటర్లు పొడవున్న కారిడార్లలో తిరుగుతూ

సైనికులను కనిపెట్టుకుని ఉందేది.

అక్కడ అవసరమైన వసతులు, వస్తువుల కోసం బ్రిటిష్ అధికారులకి అసంఖ్యాకమైన ఉత్తరాలు రాసింది. కానీ అక్కడి డాక్టర్లు, అధికారులకి ఒక 'స్త్రీ అధికారం' నచ్చేది కాదు. అయినా సరే నైటింగేల్ మారలేదు. ఆమె అలస్యాన్నీ, అలక్ష్యాన్నీ సహించేది కాదు. చివరికి అధికారులే ఆమె దారికి వచ్చారు. సైనికుల మరణాలు తగ్గుముఖం పట్టాయి.

క్రమ క్రమంగా 'చీకటి కొట్టాలు' ఆసుపత్రిలాగా మారాయి. కోలుకొంటున్న సైనికులకు ఆమె రాయడం, చదవడం నేర్పించడం ప్రారంభించింది.

రోగులకు సేవ చేసీ చేసీ తనూ మంచం పట్టింది

అప్పట్లో క్రిమియాలో ఒక భయంకరమైన వ్యాధి వస్తుండేది. ఆ వ్యాధిని 'క్రిమియన్ జ్వరం' అనే వాళ్ళు. ఆ వ్యాధి బారిన పడిన వాళ్ళు కోలుకోవడం కష్టంగా ఉండేది. నిత్యం అనారోగ్య పరిసరాల్లో ఉంచటం వల్ల నైటింగేల్‌కి క్రిమియన్ జ్వరం సోకింది. ఆ వ్యాధితో ఆమె దాదాపు మరణం అంచుల వరకూ వెళ్ళి వచ్చింది. అప్పటికే నైటింగేల్ సేవా నిరతి, కార్యసాధన బ్రిటన్‌లో వ్యాపించింది. విక్టోరియా మహారాణి సైతం నైటింగేల్ ఆరోగ్యం గురించి ఆత్రుతగా వాకబు చేస్తుండేది.

ఆమె పరిస్థితి చూసిన వైద్యులు ఆమెని ఇంగ్లండు తిరిగి వెళ్ళిపోవలసిందిగా ప్రాధేయపడ్డారు. ఆరోగ్యం కుదుట పడ్డాక మళ్ళీ తిరిగి రావచ్చని నచ్చ జెప్పారు. "మగ వారితో సమానంగా ఎటువంటి యుద్ధాన్నైనా ఎదుర్కోవడానికి తాను సిద్ధమని" ఖచ్చితంగా తెగేసి చెప్పడంతో వాళ్ళంతా తమ ప్రయత్నాలు విరమించుకున్నారు.

బ్రిటీషర్లు సంబరాలతో ఆహ్వానించారు. ఆగస్టు 7, 1857న ఫ్లోరెన్స్ నైటింగేల్ బ్రిటన్‌కు చేరింది. బ్రిటన్ రాణి తరువాత అంత పేరొందిన వ్యక్తిగా నైటింగేల్ ప్రసిద్ధి కెక్కింది.

క్రిమియాలో సోకిన వ్యాధి నైటింగేల్‌ని బలహీనపరచింది. చాలా కాలం పాటు ఆమె మంచం మీదే ఉండవలసి వచ్చింది. ఆమె తనకిష్టమైన నర్స్ పనిని తగ్గించుకోవలసి వచ్చింది. ఆమె దాదాపు 200 పుస్తకాలూ, నివేదికలు, కరపత్రాలు ప్రచురించింది. వాటిల్లో ఒకటి 1860లో ప్రచురితమైన 'నర్సింగ్'. నర్స్ వృత్తిలో బోధించే మొదట పాఠ్య పుస్తకంగా ఇది ప్రసిద్ధికెక్కింది. ఎన్నో భాషల్లోకి అనువదించబడింది కూడా!

చివరి క్షణాలు

ప్రజల ఆరోగ్యం కోసం, రోగుల సేవ కోసం అహర్నిశలూ శ్రమించిన నైటింగేల్ చివరి రోజులలో అనారోగ్యంతో బాధపడింది. 1895 కల్లా ఆమె చూపు కూడా పోయింది. త్వరలోనే మిగతా వ్యవస్థలూ క్షీణించసాగాయి. నర్సింగ్‌కి ఒక రకంగా ఊపిరి పోసిన నైటింగేల్‌కి నర్సుల అవసరం వచ్చింది. సంపూర్ణంగా నిరుపయోగంగా ఉన్నా 15 సంవత్సరాలు జీవించి, లండన్‌లో ఆగస్ట్ 13, 1910న మరణించింది.

❋

అంతర్జాతీయ గుర్తింపు

మానవాళికి నైటింగేల్ చేసిన మహోన్నతమైన సహాయం ఏమిటంటే ఆధునిక నర్సింగ్ వృత్తిని స్థాపించడమే కాక అందులో స్త్రీలకు గౌరవనీయమైన స్థానాన్ని ఇవ్వడం. ఆమె స్థాపించిన నర్సింగ్ స్కూల్ ఇప్పటికీ పని చేస్తోంది.

నైటింగేల్ జన్మదినాన్ని అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా పాటిస్తారు.

నైటింగేల్ ఇనీషియేటివ్ ఫర్ గ్లోబల్ హెల్త్ కోసం ఏర్పాటు చేసిన నైటింగేల్ డిక్లరేషన్ కాంపెయిన్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా నర్సింగ్ నేతలు ఐక్యరాజ్య సమితిని ప్రభావితం చేసి రెండు కోరికలు నెరవేర్చుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అవి: నైటింగేల్ నూరవ వర్ధంతి అయిన 2010 సంవత్సరాన్ని నర్సులు అంతర్జాతీయ సంవత్సరంగా ప్రకటించడం, నైటింగేల్ 200వ జన్మదినాన్ని పురస్కరించుకొని 2011-2020 మధ్య యుఎన్ ఆరోగ్య ప్రపంచ దశాబ్దిని ప్రకటించడం.

ఈ డిక్లరేషన్‌పై ఇప్పటి వరకూ 86 దేశాల నుండి 18,500 మంది సంతకాలు చేశారు.

ఆమె సలహా కోసం మంత్రులు, దేశాధినేతలు, రచయితలు, సంస్కర్తలు, రాజకీయవేత్తలు బారులు తీరేవారు. ఆమె రూపొందించిన నివేదికల ఆధారంగానే 1857లో రాయల్ కమిషన్ ఆన్ ద హెల్త్ ఆఫ్ ద ఆర్మీ ఏర్పాటు చేయబడింది. 1859లో మరో రాయల్ కమిషన్ ఏర్పాటైంది. దాని ఫలితంగానే 1868లో భారతదేశంలో శానిటరీ డిపార్ట్‌మెంట్ ఏర్పాటైంది.



పురాతనమైన నర్సింగ్

వేలాది సంవత్సరాలకు పూర్వం నుండే మనుషులు ఏదో ఒక రకమైన నర్సింగ్ సేవలు వాడుకునేవాళ్ళు, ప్రాచీన హిబ్రూ, ఈజిప్షియన్లు ప్రసవానికి సహాయపడటానికి స్త్రీలను వినియోగించేవాళ్ళు.

ప్రాచీన రోమ్‌లో చక్రవర్తుల భార్యలు, ధనిక వర్గాల స్త్రీలు అనారోగ్యంతో ఉన్న వారికి సహాయం మందించడంలో నర్సులు తోడ్పడేవాళ్ళు. బహుశా అప్పటి నుండే ఒక వ్యవస్థీకృత నర్స్ వృత్తి ఆరంభమై ఉంటుంది.

క్రీశ 1500 ప్రాంతంలో మత పరమైన మఠాలు మూతపడటం ప్రారంభమైంది. దాంతో రోగులను కాచేవాళ్ళు కరువయ్యారు. ధనికులు ఆసుపత్రులకు వెళ్ళేవాళ్ళు కారు. ఎవరికి వారే వ్యక్తిగతంగా డాక్టర్లను నియమించుకునేవాళ్ళు. దాంతో ఆసుపత్రిలో సిబ్బందికి తమ పని ఏమిటో తెలియకపోగా, పారిశుద్ధ్యం, ఆరోగ్యంపై అవగాహన లేకపోయింది.

ఆధునిక నర్సింగ్ నైటింగేల్‌తో ఊపిరిపోసుకుంది.



ఆఫ్రికా గుడిసె

చేసేద్దాం

నేస్తాలూ... ఇవాళ మనం ఆఫ్రికా గుడిసె ఎలా చేయాలో నేర్చుకుందామే!

ఏమేం కావాలంటే...

దీర్ఘచతురస్రాకారంలో వున్న మందపాటి చార్టు (10×30 సెంటీమీటర్లు), గమ్, రంగులు, దారం, 12 స్ట్రాలు.

ఎలా చేయాలంటే...

ముందుగా... స్ట్రాలకు పసుపు పచ్చ రంగు వేయండి. ఇంక...చార్టు మధ్యలో...కింది భాగంలో తలుపు ఆకారం గీయండి. దానికి నలుపు రంగు అద్దండి. దాని చుట్టూ నిండు గోధుమ రంగు పులిమేసెయ్యండి. ఇప్పుడు చార్టును గుండ్రంగా చుట్టండి. చివర్లను గమ్‌తో అతికించండి. ఇంటి కింది భాగం పూర్తయినట్టే. స్ట్రాలన్నీ కలిపి పట్టుకుని...ఒక చివర్న దారంతో ముడివేయండి. ఇప్పుడు రెండవ చివరను... ఇంటి కింది భాగంపైన అతికించండి. అంతే ఆఫ్రికన్ గుడిసె రెడీ.

దీన్ని ఎంచక్కా టేబుల్ మీద పెడితే అందంగా వుంటుంది. షోకేస్ వుంటే అందులో పెట్టేయొచ్చు.

ఎన్ని పులులు కనిపించాయోచ్!

హాయ్ నేస్తాలూ! ఇదిగో ఈ బొమ్మలో మీకు ఎన్ని పులులు కనిపించాయో చెప్పండి. ఆ...బాగా పరిశీలించి లెక్కపెడితే మూడు కంటే ఎక్కువే కనిపించాలి మరి. ప్రయత్నించి చూడండి.



పెద్ద గుడ్డు - బుల్లి గు

ఇదిగో పిడుగులూ... పక్షులు గుడ్లు పెడతాయ్‌కదా. మరి అన్నిటిలోకి బుల్లి గుడ్డు పెట్టే పక్షి ఏదో చెప్పకోండి చూద్దాం. తెలీదా! అవ్వ...ఎవరైనా వింటే నవ్వుతారర్రా! సరే మేమే చెప్పేస్తున్నాం. హమ్మింగ్ బర్డ్. ఇది ఎంత చిన్న గుడ్డు పెడుతుందంటే... కేవలం అర గ్రాము బరువుంటుంది. ఇంక అతి పెద్ద గుడ్డు పెట్టే పక్షి ఏదో తెల్సుకుందాం. ఉష్ట పక్షి దీని గుడ్డు సింపుల్‌గా 1.4 కేజీల బరువుంటుంది. హేయ్ భలే తమాషాగా వుందే' అనుకుంటున్నారుకదూ. వచ్చేవారం మరో తమాషా విషయం చెప్తాం. ఎదురుచూస్తుండండే.



ఆరు తేడాలు కనుక్కోండి

ముక్కలు కలిపేద్దాం



ఆడిస్తాం

ధాం...ధాం...బూర

హాలో...పిడుగులూ... సెలవులను బాగా ఎంజాయ్ చేస్తున్నారా! మీ ఊపు చూస్తుంటేనే తెలుస్తోందిలే. మాంచి బిజీగా వున్నారని. సరేగాని... మీరు ఏమేం ఆటలు ఆడుకుంటున్నారు! తెల్సినవన్నీ ఆడేశారా! కొత్త ఆటలు ఏవైనా ఆడాలని వుందా!! మేం వుండగా మీకెందుకు చింత. చకచకా కొత్త కొత్త ఆటలు ఆడిస్తాం. మరి మొదలెడదామా!

ఏమేం కావాలంటే... ఒక్కో ఆటగాడికి రెండు బూరలు, దారం. ఎంచక్కా బూరలు పెద్దగా ఊది దారం కట్టి సిద్ధంగా వుంచుకోవాలి. ఇంకా... పెద్దవారొకరు వుండాలి.

ఎక్కడ ఆడాలంటే... ఎండాకాలం కాబట్టి... పెద్ద హాల్లో ఆడుకోవచ్చు. సాయంత్రం అయితే ఆరుబయట నేలమీద కోర్టు గీసుకొని ఆడుకోవచ్చు.

ఎలా ఆడాలంటే... ముందుగా పిల్లలంతా జంటలుగా ఏర్పడాలి. అంటే ఇద్దరు కలిసి ఒక జట్టు. ఈ జట్టులో ఒకరికి రెండు కాళ్లకు (గిలకల దగ్గర) రెండు బూరలు కట్టాలి. ఇప్పుడు ఆటకు అంతా సిద్ధమైనట్టు. పెద్దవారొకరు ఎంచక్కా గట్టుమీదో... కుర్చీలోనో కూర్చుని 'రెడీ' చెప్తారు. అంతే ఆట మొదలె ట్టాలి. ఈ జంటలన్నీ కలిసి గదిలో చుట్టూ తిరుగుతుండాలి. అయితే వేరే జట్టులో వాళ్లు తమ జతగాడికి కట్టిన బూరలు పగలకొట్టకుండా అడ్డుకుంటుండాలి. ఇక్కడ ఒక షరతు కూడా వుందర్రా! బూరలను కాళ్లతో పగలకొట్టకూడదు. చేతులతో మాత్రమే పగలకొట్టాలి. కాసేపయ్యాక పెద్దవాళ్లు స్టాప్ అంటారు. అప్పుడు ఏ జట్టు వారికైతే బూరలు వుండవో వారు ఓడిపోయినట్టు. ఔటయినట్టు. ఒక బూర వున్నవాళ్లు, రెండు బూరలు వున్నవాళ్లు తిరిగి మళ్లీ ఇందాకటి మల్లే ఆడతారు. ఇలా చివరికి ఏ జట్టు అయితే తమ బూరలను కాపాడుకోగలుగుతుందో ఆ జట్టు గెల్చినట్టు.

- సాహిల్

కొమ్మూలపాటి అంజన



కథా నిలయం
శ్రీకాకుళం

పాపాయిని స్వాగతిద్దాం

"ఒరే....సుబ్బా! ఇలా రారా.. నా మనవడి పెళ్లి చూడకుండానే టపా కట్టేస్తానేమోనని భయంగా వుందిరా! అయినా మగపిల్లాణ్ణి ఇలా ఎన్నిరోజులని గుండెలమీద కుంపటిలా అట్టిపెట్టుకుంటాం చెప్పు! అప్పో సొప్పో చేసి ఆణ్ణి ఓ అమ్మడి చేతిలో పెట్టు. ఆళ్లిద్దరూ శుభ్రంగా కాపురం చేసుకుంటుంటే చూసి సంతోషంగా కన్ను మూస్తాన్రా సుబ్బా!"

"ఊరుకోవే ముసల్దానా! మగపిల్లాడికి పెళ్లి చేయాలంటే మాటలా ఈ రోజుల్లో. ఆడపిల్లను కొనుక్కోవాలాయె! అయినా వీడేమైనా పిస్తానా ఏంటి? ఆడపిల్లల తల్లిదండ్రులు మనింటి ముందు క్యూ కట్టడానికి!"

"ఏం నోరు నాయనా నీది. మంచి మాటే రాదా! వెయ్యి అబద్ధాలు చెప్పయినా సరే ఒక మగపిల్లాడి పెళ్లి చెయ్యమన్నారు పెద్దలు. కాబట్టి...చెప్పిన అబద్ధం చెప్పకుండా చెప్పేయ్. ఆ పెళ్లి తంతు కాస్తా అయిపోతే... తర్వాత వాళ్లేమనుకున్నా వచ్చే నష్టం ఏమీ లేదు. తెల్సిందా!"

"మగపిల్లాడికి పెళ్లి చేయడం ఎంత కష్టంగా వుందో...బయటికెళ్లి సంబంధాలు చూస్తే తెలుస్తుంది. ఇక్కడ కుక్కి మంచంలో పండుకుంటే ఏం తెలుస్తుంది?"

"అయితే నా మనవడు అలా ముదురు బెండకాయ లాగా... పెళ్లికాని ప్రసాదులాగా వుండిపోవాల్సిందేనా... ఆడి పెళ్లి చూడకుండానే పోవాల్సిందేనా!!

"అబ్బా.. ముసల్దానా... పోతన్నా... పోతన్నా... అంటూ... నా ప్రాణాలు కొరుక్కుతినకే. నీ గోల పడలేక నీకంటే ముందు నేను పోయేట్టున్నా. వాడికి పెళ్లి చేయాలని నాకు మాత్రం వుండదా చెప్పు! కోడలి పిల్లకోసం... కాళ్లకు స్కేటింగ్ చక్రాలు కట్టుకుని మరీ ...వెతకని ఊరు లేదు...పట్టణం లేదు. రేపో మాపో పక్క రాష్ట్రం కూడా వెళ్లాలనుకుంటున్నాం..."

ఇది మాంచి సెంటిమెంటు పండించే తెలుగు సినిమాలో సన్నివేశమో, రసవత్తరంగా సాగే కథలోని భాగమో అనుకుంటే పొరపాటే...దగ్గర దగ్గర ఇలాంటి పరిస్థితే మన పొరుగు రాష్ట్రాలైన హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్ లోని కొన్ని ప్రాంతాలలో వుంది. నిమ్మకు నీరెత్తినట్టు కూర్చుంటే రేపు మనదాకా వస్తుంది. 'అసలు ఆడపిల్లల సంఖ్య ఎందుకు తగ్గుతోంది?' అని ప్రశ్నించుకుంటే 'పుట్టేది ఆడపిల్ల అని తెలియగానే అబార్షన్లు చేయించుకోవడం వల్ల' అన్న సమాధానం ఠక్కున వచ్చేస్తుంది. మన కళ్లకు కనిపించేది ఇదే అయినా ఇందుకు కనిపించని కారణాలు ఎన్నో వున్నాయి. అవేంటో వాటి పర్యవసానాలు ఎంత భయానకంగా వుంటాయో మీరే చదవండి...

ఆడ పిల్లలు ఎందుకు వద్దు?!

'ఆడపిల్ల పుడితే అన్నీ ఖర్చులే...దానికి పెట్టే ప్రతి పైసా అనవసరపు ఖర్చు కిందే లెక్క. పైగా దానికి పెళ్లి చెయ్యాలంటే బోలెంత డబ్బు, బంగారం, వస్తువులు, కట్నం రూపంలో ముట్టచెప్పాలి. పెళ్లి ఖర్చు చూస్తే వాసిపోద్ది.

అందుకోసం అప్పు చేశామే అనుకోండి. ఇంక జీవితాంతం తీరుస్తూనే వుండాలి. కొత్త కోడలు అంటే బ్లాంక్ చెక్ లాంటిది. ఎప్పుడైనా క్యాష్ చేసుకోవచ్చు' అనుకునే వారెందరో. పైగా 'ఆడపిల్ల అంటే ఆడ పిల్ల. ఈడ పిల్లకాదు కదా. ఒక్క మాటలో చెప్పాలంటే ఆడపిల్ల గుదిబండ లాంటిది. పైగా ఆడపిల్లను జీవితాంతం ఎవరో ఒకరు కాపాడుతూనే వుండాలి' అన్న అభిప్రాయాలు మన నరనరాన జీర్ణించుకుపోయి వున్నాయి.

మగపిల్లాడంటే అంత క్రేజ్ ఎందుకు?

అబ్బాయి పుట్టాడని తెలిస్తే చాలు...అందరి ముఖాలు వంద క్యాండిల్ బల్బుల్లాగా వెలిగిపోతాయి. స్వీట్లు పంచుతారు. అదో శుభకార్యంలా చేసేస్తారు. ఇదంతా ఎందుకంటే...'అదేంటండీ బాబూ. మీకు మాత్రం తెలీనిదేముంది? అబ్బాయి పుడితే సంఘంలో గౌరవం పెరుగుతుంది. రేపు ఆడికి పెళ్లి చేస్తే అప్పనంగా కట్నం రూపంలో ఆస్తి వచ్చి పడుతుంది. పైగా కోడలు పిల్ల మనింటికొచ్చి కుటుంబీకులందరికీ ఊడిగం చేస్తుంది. మన ఆస్తి రెట్టింపవుతుంది. ఆడు సంపాదించినదంతా మన కుటుంబంలోనే వుంటుంది. వయసుడిగాక ముద్ద పెట్టేది ఆడేకదా. రేపు మనం చచ్చిపోతే చితిపెట్టి పున్నామనరకం నుంచి కాపాడేది ఆడే కదా. మన ఇంటి పేరు నిలబెట్టేది ఆడేకదా...' అనేస్తారు తడుముకోకుండా.

తమాషా నమ్మకాలు...నానుడులు

మగపిల్లాడిని మునగచెట్టు ఎక్కించే... ఆడపిల్లను కించపరిచే నమ్మకాలకు, నానుడులకు కొదవే లేదు. హర్యానా, తమిళనాడుల్లో బాగా ప్రచారంలో వున్న అలాంటి కొన్ని నానుడులు చెప్పుకుందాం. ❖ నీకు ఒక మగపిల్లాడు వుంటే ఒక కన్ను వున్నట్టు. ఇద్దరు మగపిల్లలుంటే రెండు కళ్లు వున్నట్టు. అసలు మగపిల్లలే లేకపోతే గుడ్డివాడికింద లెక్క. ❖ ఆడపిల్లలను కనడం, పెంచడం అంటే పొరుగింటోడి పెరటి చెట్టుకి నీళ్లు పొయ్యడమే. ❖ మగపిల్లలు కావాలనుకునే వారికోసం పంజాబ్‌లో ప్రత్యేకంగా కొన్ని గుళ్లున్నాయి. అక్కడికెళ్లి పూజలు చేస్తే పుత్రరత్నాలు పుడతారని విశ్వసిస్తారు.

ఆడపిల్లను వదిలించుకునే రోగం ఇప్పటిది కాదు

ఇప్పుడంటే సైన్సు, టెక్నాలజీ పెరిగిపోయింది. మరి పాత రోజుల సంగతేంటి? అప్పుడు ప్రసవం అయ్యేవరకు పుట్టేది ఆడపిల్లో...మగపిల్లాడో తెలిసేది కాదు. తీరా ఆడపిల్ల పుట్టాక ఇంటిల్లిపాది ముఖాలు మాడిపోయేవి. ఇష్టంలేని ఆడశిశువును పరలోక ప్రయాణం కట్టించడానికి అబ్బో ...ఎన్ని మార్గాలో. ఆహారం అస్సలు ఇవ్వకుండా ఆకలితో మాడ్చి కొట్టడం, తడిబట్టతో, దిండుతో శిశువుకు ఊపిరి ఆడనివ్వకుండా చేయడం... మట్టికుండలో పసిపాపలను పెట్టి మూతవేసి కాల్చడం...గోడకేసి కొట్టడం... సజీవంగా కుండలోపెట్టి మూతవేసి పూడ్చిపెట్టడం... ఆకలితో ఏడుస్తూ చనుబాలుకోసం వెతుక్కునే పాప గొంతులో వడ్ల గింజ వేయడం...పాప నోట్లో గన్నేరు పాలు పిండడం...పొగాకులు, నీళ్లు కలిపి రసం పిండి పాపతో తాగించడం...విషపూరితమైన ఎరువులను గొంతులో వేయడం...ఇలా ఎన్నో రకాలుగా ఆడశిశువులను వదిలించుకునేవాళ్లు. నరకం వుందో లేదో? యముడు పెట్టే కష్టాలు వున్నాయో లేవో గానీ... ఆడపిల్లగా పుట్టిన నేరానికి అయినవారి చేతుల్లోనే భూలోక నరకం చవిచూసి మరీ కన్నుమూసేవారా ఆడపిల్లలు. కానీ ఇప్పుడు టెక్నాలజీ పెరిగిపోయింది. అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్‌ను కనుగొన్నారు. దీని ద్వారా పుట్టబోయేది ఆడో మగో తెల్సుకోవచ్చు. కానీ దీన్ని కనుగొన్నది మాత్రం ఇందుకు కాదు. గర్భంలోని బిడ్డ ఎదుగుదల ఎలా వుంది? కవల పిల్లలా? జన్యుపరమైన వ్యాధులున్నాయా? అవయవాల్లో అసాధారణ మార్పులున్నాయా అనేవి తెలుసుకోవడానికి, గర్భంలోని శిశువును పరిరక్షించడానికి, శిశుమరణాలు సంభవించకుండా కపాడడానికి దీన్ని కనుగొన్నారు. అవన్నీ వదిలేసి దీనిద్వారా గర్భంలో ఉన్నది ఆడ, మగ అన్నది తెలుసుకుంటున్నారు. తెలివిగా... సులువుగా... ఆడ శిశువులను వదిలించుకుంటున్నారు. ఐదారొందలు ఖర్చు పెడితే అంతా తెలిసిపోతుంది. వీటికోసం ఎన్నో స్కానింగ్ సెంటర్లున్నాయి. ఇప్పుడు ఐదారొందల ఖర్చుకు వెనకాడితే ముందు ముందు లక్షల రూపాయల కట్నం ఇవ్వాల్సి వస్తుంది? అందుకు మీరు సిద్ధమేనా? అంటూ ఆడపిల్లల పట్ల ఇప్పటికే వున్న వ్యతిరేకతను మరింత పెంచి డబ్బులు దండుకునే స్కానింగ్ సెంటర్లు పెరిగిపోయాయి. హర్యానా, తమిళనాడు వంటి రాష్ట్రాలలోని కుగ్రామాలలో సైతం ఈ స్కానింగ్ సెంటర్లు అందుబాటులో వున్నాయి. ఎలాగంటారా! అల్ట్రా సౌండ్ స్కానింగ్ సిస్టమ్స్‌ని వ్యానుల్లో

...అనర్థాలు అన్నీ ఇన్నీ కావు

ఆడపిల్లల సంఖ్య ఇంత దారుణంగా తగ్గితే సమాజంలో ఎన్నో అనర్థాలు కలుగుతాయి. లక్కీగా బతికి బైటపడిన పిల్లలు ...పరాయి రాష్ట్రాలకు సైతం కోడళ్లుగా వెళ్లాల్సి వస్తుంది. అక్కడ బండచాకిరీ చేయాల్సివస్తుంది. ఇంట్లో వున్న మగవారందరి 'అవసరాలూ' వారే తీర్చవలసి వుంటుంది. వారికి అన్ని ఏర్పాట్లూ చేయాల్సి వుంటుంది. వారిని బానిసల్లా చూసే పరిస్థితి దాపురిస్తుంది. పైగా భిన్న సాంప్రదాయాలు, సంస్కృతులు, భాష మధ్య పెరిగిన వారు అకస్మాత్తుగా పరాయి ప్రదేశాలకు చేరి ప్రశాంతంగా బతకలేని పరిస్థితి దాపురిస్తుంది. ఆత్మహత్యలు పెరిగిపోతాయి. ఆడపిల్లల కిడ్నాప్.. వ్యభిచారం పెరిగిపోతుంది. వేధింపులు పెరుగుతాయి. బాల్యవివాహాలు పెరుగుతాయి. దీంతో మహిళలకు విద్య అందదు. ఆరోగ్య సమస్యలు విజృంభిస్తాయి. తాము ఎదిగే వయసులోనే మరో ప్రాణికి ప్రాణం పోయాల్సి వస్తుంది. పేదయువకులకు పెళ్లిళ్లు కావడం కష్టమౌతుంది. కన్యాశుల్కం మళ్లీ మొదలైనా ఆశ్చర్యం లేదు.



గర్భస్థ శిశువు ఆడో మగో తెల్సుకోవడం నేరం

అల్ట్రాసౌండ్ సిస్టమ్ ద్వారా గర్భంలో వున్నది ఆడో మగో గుర్తించి ఆడపిల్లను కనడం ఇష్టంలేక భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారు. దీంతో ప్రభుత్వం వారు ఆడ, మగ శిశువు నిర్ధారణ పరీక్షలను నిలుపదల చేస్తూ తొలిసారిగా 1994లో పిఎన్‌డిటి చట్టం చేసింది. ఈ చట్ట ప్రకారం అల్ట్రాసౌండ్, లాబ్ ఏర్పాటు చేసుకోవాలంటే ప్రభుత్వ అనుమతి తప్పని సరి. ప్రభుత్వ అనుమతి లేని ల్యాబ్‌లకు పరికరాలు అమ్మడం తప్పు. గర్భస్థ శిశువు పరీక్షలకు అంటే శిశువు ఆరోగ్యం గురించి తెలుసుకోవడానికి మాత్రమే వినియోగించాలి. ఈ పరీక్షలు ప్రతి గర్భిణికి జరపకూడదు. 1. గర్భిణీ స్త్రీకి 35 సంవత్సరాలు పై బడి ఉన్నప్పుడు 2. గతంలో రెండుసార్లు గర్భం నిలవకుండా పోయినప్పుడు 3. గర్భిణికి గాని, ఆమె భర్త కుటుంబంలో గాని, మెంటల్ సంబంధ వ్యాధులు, అంగవైకల్యాలు ఉన్నవంటేనే ఈ పరీక్ష జరిపి తెలుసుకోవాలి. పైగా ఈ పరీక్షలు జరుపడానికి గర్భిణి అంగీకార పత్రం తప్పని సరి, వైద్యులు, టెక్నీషియన్స్ ఆమెకు అర్థమయ్యే భాషలో ఎందు నిమిత్తం అల్ట్రాసౌండ్ టెస్ట్ చేస్తున్నారో చెప్పాలి. సైడ్ ఎఫెక్ట్ ఏముంటాయో కూడా తెలియజేయాలి. గర్భస్త శిశువు ఆడ, మగ అనే విషయం తెలుపకూడదు (సెక్షన్ 6). ఏ సంస్థ అయినా ముందస్తు గర్భస్థ శిశువు పరీక్షలు జరిపి ఆడ, మగ అని సెక్స్ నిర్ధారణ చేసినా, ప్రోత్సహించినా, మూడు సంవత్సరాలు జైలు శిక్ష లేదా 10 వేల రూపాయల జరిమానా విధించబడుతుంది. మరొకసారి ఈ తప్పు చేసినట్లయితే ఐదు సంవత్సరాలు జైలు శిక్ష, 50 వేల రూపాయల జరిమానా విధించబడును. అంతే కాకుండా కోర్టు కేసు తేలే వరకు ప్రాక్టీసు నుండి సస్పెండ్ చేయవచ్చు. గర్భస్థ శిశువు సెక్స్ తెలుసుకోవడానికి ప్రయత్నం చేసిన వ్యక్తికి కూడా పై విధంగా శిక్ష పడుతుంది (సెక్షన్ 22). డయాగ్నస్టిక్ సంస్థలు, పేషెంట్‌కు సంబంధించిన రికార్డులన్నీ రెండు సంవత్సరాల వరకు భద్రపరచవలసి ఉంటుంది (సెక్షన్ 29). సంబంధిత ప్రభుత్వ సంస్థలు ఎప్పడైనా ఏదైనా అనుమానం వచ్చినప్పుడు గాని, కంప్లెయింట్ ఉన్నా, లేకున్నా దాడులు జరిపి రికార్డులు పరిశీలించే అధికారం వుంది (సెక్షన్ 30).

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది.

పెట్టుకుని కుగ్రామాలలో సైతం తిరుగుతారు.

కనుమరుగవుతున్న కనుపాపలు...

ఐక్యరాజ్య సమితి లెక్కల ప్రకారం మనదేశంలో ఏడాదికి 750,000 మంది ఆడశిశువులను అబార్షన్ల రూపంలో చంపేస్తున్నారు. పంజాబ్, హర్యానా, బీహార్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, రాజస్థాన్‌లో ఆడపిల్లల భ్రూణ హత్యలు ఎక్కువగా జరుగుతున్నాయి. గత ఇరవై సంవత్సరాలలో భారతదేశంలో పది మిలియన్ల ఆడగర్భస్థ పిండాల అబార్షన్లు జరిగాయి. 2001లో మన దేశ జనాభా లెక్కలు పరిశీలిస్తే... మహిళల సంఖ్య ఎంతగా తగ్గిపోతోందో తెల్సిపోతుంది. పంజాబ్ - 874, చండీఘర్-773, హర్యానా 861, ఢిల్లీ- 821, రాజస్థాన్-922, ఉత్తరప్రదేశ్ -898, సిక్కిం -875, ఆంధ్రప్రదేశ్ - 978, తమిళనాడు-986, ఒరిస్సా-972, బీహార్ - 921 (ప్రతి వెయ్యి మంది పురుషులకు) మహిళలు వున్నారు. తమిళనాడులోని సేలం జిల్లాలోని ఒక తెగ ఆడపిల్ల పుడితే చాలు నిర్దాక్షిణ్యంగా చంపేస్తోంది. రాజస్థాన్‌లోని దేవ్డా గ్రామంలో కేవలం 12 మంది ఆడపిల్లలు మాత్రమే ఉన్నారంటే నమ్ముతారా!

కానీ...ఆడపిల్లలకూ హక్కులున్నాయ్!

ఆడపిల్లలకూ మగపిల్లల్లాగే పుట్టే హక్కు వుంది. ఉన్నత విద్య చదువుకునే హక్కు వుంది. మంచి పుష్టికరమైన ఆహారం తీసుకొనే హక్కు వుంది. జబ్బు పడితే వైద్యం చేయించుకునే హక్కు వుంది. శక్తి సామర్థ్యాలను నిరూపించుకునే హక్కు వుంది. కానీ ఇవన్నీ ఇవ్వాల్సింది మాత్రం మనమే. అది మర్చిపోకూడదు.

కోడళ్ల కోసం పక్క రాష్ట్రాలలో వేట

ముందు చూపు లేకుండా ఏ పనీ చేయకూడదంటారు పెద్దలు. కానీ పెద్దలే ఆడపిల్లల విషయంలో ముందు చూపు లేకుండా వ్యవహరించడం వల్ల ఇప్పుడు పెద్ద సమస్యే వచ్చిపడింది. పంజాబ్, ఉత్తరప్రదేశ్, హర్యానా రాష్ట్రాలలోని కొన్ని ప్రాంతాలలో ఇప్పటికే అబ్బాయిలు ముదురు బెండకాయల్లా తయారవుతున్నారు. వయసు పైబడుతున్నా చేసుకోవడానికి ఆడపిల్లలే కరువయ్యారు. ఇక దిక్కుతోచక... మధ్యప్రదేశ్, ఒరిస్సా, పశ్చిమబెంగాల్, ఢిల్లీ... ఒక్కోసారి పొరుగుదేశమైన బంగ్లాదేశ్ నుంచి కూడా భార్యలను తెచ్చుకుంటున్నారంటే నమ్మబుద్ధికాదు.

సీమ ఏదైనా సీను మాత్రం ఇదే

పుట్టబోయేది అమ్మాయని తెలుసుకున్న తర్వాత అబార్షన్ల రూపంలో ఏరిపారేసే దుస్థితి విదేశాల్లోనూ వుంది. దక్షిణ ఆసియాలో ఎక్కువగా వుంది. ఉత్తర ఆఫ్రికాలోని కొన్ని దేశాల్లో కూడా వుంది. పాకిస్తాన్, బంగ్లాదేశ్, తైవాన్,



మనలోనే మార్పు రావాలి

ఆడపిల్ల పుట్టినా, మగ పిల్లాడు పుట్టినా దానికి కారణం పురుషుడేనని ఎన్నో ఏళ్ల క్రితం శాస్త్రం రుజువు చేసింది. ఆడపిల్ల పుట్టడానికి కారణం తల్లేననే అపోహ సమాజంలో పాతుకుపోయింది. పదిహేనేళ్ల క్రితం మహారాష్ట్రలో అల్ట్రా సౌండ్ స్కానింగ్ మెషిన్లు అందుబాటులోకి వచ్చాయి. వీటి ద్వారా గర్భంలో ఉన్నది ఆడా, మగా అని గుర్తిస్తున్నారు. లోపల ఉన్నది ఆడ శిశువైతే వెంటనే అబార్షన్ చేయించుకుంటున్నారు. దీంతో అక్కడున్న ఒక స్వచ్ఛంద సంస్థ దీనిపై గొడవ చేసింది. దీంతో మొదట మహారాష్ట్ర ప్రభుత్వం అక్కడ ఒక చట్టాన్ని ప్రవేశపెట్టింది. తర్వాత దీన్ని కేంద్రం దేశవ్యాప్తంగా చట్టం చేసింది. అయితే వరకట్న వ్యతిరేక చట్టం, బాల వివాహాల నిర్మూలన చట్టం లాగానే ఉండిపోయింది. ప్రీ ఇంప్లాంటేషన్ అండ్ ప్రీనాటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్ యాక్ట్‌కు 2003లో సవరణ చేశారు. హర్యానాలో ఒక డాక్టర్ స్కానింగ్ చేసి సెక్స్‌ను నిర్ధారిస్తున్నారని స్వచ్ఛంద సంస్థ సుప్రీం కోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం వేసింది. దీంతో కేంద్రానికి సుప్రీం మొట్టికాయలేసింది. చట్టం చేశారు కానీ, దాన్ని సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో అథారిటీలు ఏర్పాటయ్యాయి. రాష్ట్ర స్థాయిలో మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనర్, జిల్లా స్థాయిలో కలెక్టర్ ఛైర్మన్‌గా అడ్వైజరీ కమిటీలు ఏర్పాటయ్యాయి. ఈ కమిటీలో ఒక స్త్రీ వ్యాధుల వైద్యనిపుణులు, చిన్నపిల్లల వైద్య నిపుణులు, రేడియాలజిస్ట్ ఉండాలి. వీరితోపాటు స్వచ్ఛంద సంస్థల, మహిళా సంఘాల ప్రతినిధులు సభ్యులుగా వుంటారు. అయితే అబ్బాయి వంశాకురమని, అమ్మాయి అయితే భారమనే భావన ఇప్పటికీ తల్లిదండ్రుల్లో ఉంది. మన ఆలోచనల్లో మార్పు రావాలి. ఇప్పటికీ కొన్ని కుటుంబాల్లో కూతురికి పెళ్లయినా, పిల్లలు పుట్టినా, బాధ్యత ఆమె తల్లిదండ్రులే తీసుకుం టున్నారు. అమ్మాయిలు అంతరిక్ష యానం చేస్తున్నారని, చంద్రయానం చేయబోతున్నారని అంటాం. కానీ ఆడపిల్లని తెలిస్తే పురిట్లోనే చంపేస్తాం... ఇది మన సంప్రదాయం. ఒక శతాబ్దం దాటితే 100 మందికి పురుషులకు ఒక స్త్రీ వుంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉమ్మడి ఆస్తి బయటికి వెళ్లిపోతుందని కూడా భ్రూణ హత్యలు చేస్తున్నారు. మను ధర్మ శాస్త్రం రాకముందు సమాజంలో మాతృ స్వామ్య వ్యవస్థ ఉండేది. మను ధర్మ శాస్త్రం వచ్చాక పితృస్వామ్య వ్యవస్థ ఏర్పడింది. అప్పటి నుంచే ఆడపిల్లల పట్ల చులకన, చీదరింపు, పురిట్లోనో...పుట్టకముందో వదిలించుకోవడం మొదలైంది. కానీ ఐక్యరాజ్య సమితి మహిళలకు పునరుత్పత్తి హక్కులను ఏర్పాటు చేసింది. అంటే... ఎప్పుడు పెళ్లి చేసుకోవాలి, ఎప్పుడు పిల్లల్ని కనాలి, ఎంత మందిని కనాలి, పెళ్లి చేసుకోవాలా వద్దా? అని స్త్రీలే నిర్ణయించుకోవాలని దీన్లో వుంది.

డాక్టర్ పి.బాలాంబ, మెంబర్,
డిస్ట్రిక్ట్ లెవల్ అడ్వైజరీ కమిటీ ఫర్ పిఎన్‌డిటి యాక్ట్, హైదరాబాద్.

దక్షిణకొరియా, న్యూగినియా, ఇండొనేషియా, మలేషియా, సింగపూర్, చైనాల్లో మహిళల సంఖ్య తక్కువగా వుంది. యునిసెఫ్ లెక్కల ప్రకారం బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్‌లో ప్రతి వందమంది పురుషులకు 94 మంది మహిళలు వున్నాయి. చైనాలో ప్రతి వందమంది పురుషులకు 88 మంది స్త్రీలున్నారు. చైనీయులు, దక్షిణ కొరియన్లు వియత్నాం వంటి దేశాల నుంచి కోడళ్లను తెచ్చుకుంటున్నారు.

సమాజంలో మార్పు కోసం...

పురుషుడి ఉనికి స్త్రీ మీదే ఆధారపడి వుంది. అంతటి వున్నత పాత్ర పోషిస్తున్న మహిళలు, బాలికలకు మనం ఇస్తున్న స్థానం ఏంటో... జనాభా నిష్పత్తిని పరిశీలిస్తే అర్థమైపోతుంది. ఇలా జరగకుండా వుండా లంటే... సమాజంలో మార్పు రావాలి. అంటే మనలోనే మార్పు రావాలి. అందుకోసం ఆడపిల్లలను స్వాగతిద్దాం. వారికి విద్యాబుద్ధులు చెప్పిద్దాం. వారికి కూడా మగవారితో సమానమైన అవకాశాలు, భద్రత కల్పిద్దాం. అలాగే అమ్మాయిలకు తామూ మగవారితో సమానమే అన్న భావన కల్పిద్దాం. ఉద్యోగాలు చేసి ఆర్థికంగా తమ కాళ్లమీద తాము నిలబడేలా చూద్దాం. చిన్నతనం నుంచీ మగపిల్లలకు ఆడపిల్లలపట్ల, మహిళల పట్ల గౌరవభావం కలిగేలా బుద్ధులు నేర్పుదాం.

చిట్టి పాపా! స్వాగతం!!

మనం ఎంతోమంది దేవతలను ఆరాధిస్తాం. పూజిస్తాం. కానీ పుట్టబోయేది ఆడపిల్లలని తెలిస్తే మాత్రం నిర్దాక్షిణ్యంగా చంపేస్తాం. ఇలా రెండు రకాలుగా ఎందుకు చేస్తాం? గర్భంలో వున్న పాపాయి మీద రెండు చేతులూ వేసుకొని కళ్లు మూసుకుంటే... చిన్ని చిన్ని చేతులు... బుల్లి వేళ్లు... అమాయ కమైన ముఖం... బుజ్జి ముక్కు ఆత్రంగా చూసే కళ్లు... తొమ్మిది నెలలు ఎప్పుడు నిండుతాయా... ఎప్పుడెప్పుడు ఈ భూ ప్రపంచంలోకి అడుగెడదామా! ఎప్పుడెప్పుడు అమ్మ చేతుల్లోకి వద్దామా? ఎప్పుడెప్పుడు ముద్దు ముద్దుగా 'అమ్మా' అని పిలుద్దామా అని ఉబలాటపడే పాప రూపం... లీలగా కనిపిస్తుంది. అప్పుడు ఎవరూ అంత క్రూరంగా ఆలోచించలేరు. అబార్షన్ పేర ఆ చిన్నారి పాపను ముక్కలు ముక్కలు చేయలేరు. చిట్టి పాపకు చిరునవ్వుతో స్వాగతం పలుకుతారు. కాదంటారా!



నాగులు తిరిగే కోనలో....

డా॥ మంతెన సూర్యనారాయణరాజు

"ఇదిగో వెంకట్రావ్! నేను ఈ విషయం కమిటీ ప్రెసిడెంటుగారి దృష్టికి తీసుకెళతాను. ఆయనేం చెబితే అది చేస్తాను. ఇప్పుడు నేను అర్జెంటుగా హెడ్మాష్టారింటికి వెళ్ళాలి. ఇవ్వాళ ఆయన ఊరు వెళ్తున్నారు. నువ్వేదైనా మాట్లాడదలచుకుంటే స్కూలుకురా" అన్నాడు రెండడుగులు వీధిలోకి వేస్తూనే.

"ఈ మాత్రం దానికి నేను స్కూలుకు రావడం దేనికని మీ దగ్గరికొచ్చాను. మీకే సేతనైతే విషయం సరిదిద్దుతానని సెప్పండి. అంతేగాని పదిసార్లింటికని బడికని తిప్పియ్యడం అంత మంచి పద్ధతిగాదు మీలాంటి పెద్దలకండి" అన్నాడు.

"రంగనాయకులు గారు! ఏవండి రంగనాయకులు గారు!" అంటూ పిలిచాడు జిడ్డు వెంకట్రావు. జిడ్డు వాళ్ళింటి పేరు కాదులెండి.

రంగనాయకులు కూతురు బయటికి వచ్చి "అలా కూర్చోండి. నాన్న స్నానం చేస్తున్నారు. పది నిమిషాల్లో వచ్చేస్తారు" అంది.

'మంచిదమ్మా! అన్నట్టు నీ పేరేమిటి?" అడిగాడు వెంకట్రావు

"హైమ"

"వట్టి హైమేనా! ఇంకా ఏమైనా ముందు వెనకా ఉన్నాయా?"

"పచ్చి పులుసు వీరవెంకట నాగహైమవతీ దేవి" సమాధానం చెప్పింది.

"అదీ అలా చెప్పు. వట్టి హైమని చెప్పి ఊరుకుంటే ఎలా!" అన్నాడు వెంకట్రావు.

ఆ అమ్మాయి నాకు పనుందన్నట్లు "మీరు కూర్చొని ఆ పేపర్ చూస్తుండండి. నేను హోం వర్కు చేసుకోవాలి" అతగాడికి చెప్పి లోనికెళ్ళిపోయింది.

రంగనాయకులు డ్రస్సు వేసుకొని వరండాలోనికొచ్చాడు. రాగానే

"నువ్వా వెంకట్రావ్! వేరెవరో అనుకున్నాను. నాతో అంత అర్జెంటు పనేమొచ్చిపడింది" అన్నాడు కూర్చుని పేపర్ అందుకుంటూ.

"పనంటే పని కాదులెండి రంగనాయకులు గారూ! ఏదో మా పిల్లగాడు నిన్న మీ క్లాసులో అల్లరి చేశాడట. అంచేత దాని గురించి మాట్లాడదామని వచ్చాను" అన్నాడు అసలు విషయం కదలేయబోతున్నట్టు.

ఈలోగా హెడ్మాష్టారింటి దగ్గర్నుంచి ప్యూన్ పల్లయ్య వచ్చి "రంగనాయకులు గోరూ! అర్జెంటుగా మిమ్మల్ని ఎడ్డిమేట్టారుగోరు రమ్మంటున్నారండి. ఆయనివ్వాళ పట్నం ఎల్లాల్సొచ్చిందట. తవురివ్వాళ ఇన్సార్టి తీసుకోవాలి గాబోలు బాబూ!" అన్నాడు.

"సరే నడు వస్తున్నా!" అన్నాడు లోనికెళ్ళి ఉత్తరీయం పైన వేసుకొని తిరిగి వస్తూ.

పల్లయ్య వెళ్ళిపోయాడు. వెంకట్రావు రంగనాయకులవైపే చూస్తూ వుండిపోయాడు. రంగనాయకులు వెంకట్రావుతో "ఏమయ్యా! మీ వాడు అసలు అల్లరికి పెట్టింది పేరు. ఇన్నాళ్ళూ ఓపిక పట్టా! ఇప్పుడు హద్దుమీరింది బైటికి పెట్టాను" అన్నాడు ఇంక తాను బయల్దేరి వెళ్ళబోతున్నట్టుగా.

"అది కాదండి. నా మాటినండి. మావాడికామధ్య పిచ్చికుక్క కరిచింది. మొన్నటి వరకూ వైద్యం చేయించాను. ఒకరోజు వాళ్ళ తాతగారి ఊరెళ్ళినప్పుడు ముఖం తిరిగి పడిపోయాడు. దాంతో ఆస్పత్రిలో కొన్నాళ్ళు వుంచాను" అంటూ ఇంకా ఏదో చెప్పబోతుండగా...

రంగనాయకులు "అబ్బా! వెంకట్రావ్! నిన్నా విషయాలన్నీ ఎవరడిగారు చెప్పు? వాడు నా క్లాసులో గోలచేశాడు. ఈలలు వేశాడు. అరిచాడు. తక్షణం బయటికి పంపించాను. క్లాసుకు రావద్దని కూడా చెప్పాను. అసలు విషయం గురించి మాట్లాడక ఏదో కుక్క కరిచిందంటూ ఆ విషయాలన్నీ చెప్పుకొస్తావు దేనికి?" అన్నాడు ముఖం చిట్లిస్తూ.

"ఒకవేళ ఆడు విజిలేస్తే, అరిస్తే... గోలచేస్తే తప్పేననుకోండి" అంటూ మళ్ళీ ఏదో చెప్పబోయాడు.

రంగనాయకులు అతనిని పూర్తిగా చెప్పనివ్వకుండా "ఏం పెద్దమనిషివయ్యా! ఒక వేళ విజిలేస్తే, అరిస్తే, గోలచేస్తే అంటున్నావు. ఏ తప్పు లేకుండా బయటికి గెంటడం నాకు సరదా ఏవిటి చెప్పు?" నిలదీశాడు.

"సరదా అంటే కాదనుకోండి..." అంటూ సాగతీయబోయాడు.

"ఇదిగో వెంకట్రావ్! నేను ఈ విషయం కమిటీ ప్రెసిడెంటుగారి దృష్టికి తీసుకెళతాను. ఆయనేం చెబితే అది చేస్తాను. ఇప్పుడు నేను అర్జెంటుగా హెడ్మాష్టారింటికి వెళ్ళాలి. ఇవ్వాళ ఆయన ఊరు వెళ్తున్నారు. నువ్వేదైనా మాట్లాడదలచుకుంటే స్కూలుకురా" అన్నాడు రెండడుగులు వీధిలోకి వేస్తూనే.

"ఈ మాత్రం దానికి నేను స్కూలుకు రావడం దేనికని మీ దగ్గరికొచ్చాను. మీకే సేతనైతే విషయం సరిదిద్దుతానని సెప్పండి. అంతేగాని పదిసార్లింటికని బడికని తిప్పియ్యడం అంత మంచి పద్ధతిగాదు మీలాంటి పెద్దలకండి" అన్నాడు.

రంగనాయకులికి అరికాలి మంట నెత్తికెక్కింది. "ఇదిగో వెంకట్రావ్! నీకు మాట్లాడ్డం తెలియదు. ఇక నీ కొడుకు గురించి ఏదైనా చెబితే ప్రెసిడెంటుగారికి చెప్పు. నేను మాత్రం ఈ విషయంలో ఏమి చెయ్యలేను" అన్నాడు.

"అంతేనంటారా!" అన్నాడు కోపంగా వెంకట్రావు. "ముమ్మాటికీ అంతే!" అంటూ రంగనాయకులు వేగంగా అడుగులేసుకుంటూ వెళ్ళిపోయాడు.

❋ ❋ ❋

థర్డ్ బెల్ కాగానే స్కూల్లో వున్న హయ్యర్ ఫారమ్ విద్యార్థులంతా బైటికొచ్చి గుమిగూడారు. రంగనాయకులు గది బైటికొచ్చి విద్యార్థుల్ని చూశాడు. వెంటనే వెంకట్రావు కొడుకు పురుషోత్తం "రంగనాయకులు డౌన్ డౌన్" అంటూ అరిచాడు. అందరూ అతనికి వంత పాడారు. రంగనాయకులుకి ఈ హఠాత్పరిణామానికి ముచ్చెమటలు పోశాయి. పల్లయ్య చేత ప్రెసిడెంటుగారికి రమ్మని కబురు పెట్టాడు.

బయట విద్యార్థులుండటం చూసి లోయర్ ఫారమ్స్ వాళ్ళూ కూడబలుక్కుని బైటకు వచ్చేశారు. రణగొణ ధ్వనులు, కేకలతో స్కూలు వాతావరణం వేడెక్కింది. ప్రెసిడెంటుగారి కారు వచ్చి హైస్కూలు ముందు ఆగింది. విద్యార్థులంతా కారు చుట్టూ మూగారు. పైగా పురుషోత్తం తప్పు లేదని చెబుతూ తన దగ్గర ప్రైవేటు జేరమంటే జేరలేదని కోపంతో అతనిని బైటికి వెళ్ళగొట్టినట్లు కొత్త కథనం కల్పించి చెప్పారు. రంగనాయకులు విద్యార్థుల్ని పంపించేసి ప్రెసిడెంటు గార్ని లోనికి తీసుకుపోయాడు.

కొద్దిసేపటికి రంగనాయకులే విద్యార్థులున్న ప్రదేశానికి వచ్చి ఎంతో వినయంగా గట్టిగా "నాదే అన్ని విధాలా తప్పు. పురుషోత్తంతో బాటు మీరంతా క్లాసులకు వెళ్ళిపోండి" అన్నాడు. వాళ్ళలో ఒకడు "స్టూడెంట్స్ యూనియన్" అని కేక వేశాడు. మిగిలిన వాళ్ళు "వర్ధిల్లాలి" అంటూ ముక్త కంఠంతో ఎలుగెత్తి పలికారు. అలాగే "పురుషోత్తం" అనగానే "జిందాబాద్" అంటూ అరుచుకుంటూ ఎవళ్ళ క్లాసుల్లోకి వాళ్ళు వెళ్ళిపోయారు.

రంగనాయకులు ఏడుపుగొట్టు ముఖంతో హెడ్మాస్టర్ గదిలోకి తిరిగొచ్చాడు. ప్రెసిడెంటు పేరయ్యగారు మీసం మెలేస్తూ "రంగనాయకులూ! కాబోయే హెడ్మాష్టరివి. కాస్తంత పిల్లల్ని సూసీసూడనట్టు పోవాలిగాని, పెతీదానికి ఈ పట్టుదల కూడదు. పైగా ఆ



సాయంకాలం ఇంటికెళ్ళేటప్పటికిగాని పురుషోత్తాన్ని కొట్టిన దానికి ఫలితం ఏమిటో రంగనాయకులికి తెలీరాలేదు. ఇంట్లో సామానంతా వెంకట్రావు తాలూకు మనుష్యులు వీధిలోకి విసిరిపారేశారు. భార్యా పిల్లలు వీధిలో వేరెవరి పంచనో నిలబడి ఉన్నారు. ఇంటి యజమాని లోపల గదులన్నీ కడిగిస్తూ, తుడిపిస్తూ కనిపించాడు. పక్క ఇంటి పిచ్చమ్మగారి ఇంట్లో సామాను వేసుకుంటానని చెప్పి... భార్యా పిల్లల్ని ఇవాళ్టికి అక్కడే గడపమని చెప్పి పోలీసు రిపోర్టివ్వడమే తక్షణ కర్తవ్యమని ఊరి చివరి కెళ్ళాడు. పొలిమేర దాటబోతుండగా వెంకట్రావు తన బలగంతో ఎదురయ్యాడు.

వెంకట్రావెవరనుకున్నావు? ఆడు సాయానా మా బామ్మరిది సుబ్బారావు ..... దాని తమ్ముడు" అంటూ ఓ చవకబారు ఉపన్యాసం దంచాడు. హైస్కూల్ కమిటీ ప్రెసిడెంట్ ఆ విధంగా మాట్లాడటంతో రంగనాయకులుకు తల కొట్టేసినంత పనయ్యింది.

వరుసగా నాలుగు రోజులు హైస్కూలుకి సెలవు పెట్టేశాడు. ఐదో రోజు స్కూలుకెళ్ళి ఇంటికొచ్చేటప్పటికి వెంకట్రావు విజయగర్వంతో తన రాకకోసం నిరీక్షిస్తున్నట్లు గమనించాడు. కాబోయే ఎమ్మెల్యేలా ఫోజు కొడుతూ "రోగం కుదిరినట్టేనా పంతులూ! పిల్లకాయలు తప్పులు సేత్తారు. అది వాళ్ళ జన్మహక్కు. ఎదవది నువ్వు బియ్యేలూ, ఎమ్మేలూ సదివావని రూల్సు పాటిత్తే కుదరదీ రోజుల్లో" అంటూ హేళనగా నవ్వాడు.

"ఐసే! గెటవుట్ ఫ్రమ్ హియర్" అంటూ అరిచాడు రంగనాయకులు కోపంతో ఊగిపోతూ.

"పంతులూ! వళ్ళు దగ్గరెట్టుకు మాట్టాడు. ఎవురితో మాట్టాడుతున్నావో తెలుసా! సుబ్బారావు బామ్మర్దితో" అంటూ పళ్ళు పటపట లాడించాడు.

ఈలోగా లోపల్నుంచి ఆ మాటలు విని రంగనాయకులు కొడుకు వేగంగా అక్కడికొచ్చి "బుద్ధి లేదయ్యా నీకు. బయటకు పొమ్మంటుంటే నీగ్గాదూ!" అంటూ తగులుకున్నాడు.

వెంకట్రావు తోక తొక్కిన త్రాచులా "అమ్మ కుర్ర నాకొడుకా! ఏలెడంతలేవు. నాకు బుద్ధి లేదంటావా? నిన్నేం జేత్తానో సూడు" అంటూ పంచె ఎగగట్టాడు.

రంగనాయకులు భార్య అక్కడికొచ్చి "బాబూ! వాడు పసివాడు. వాడి జోలికి రాకు. నీకు పుణ్యముంటుంది" అంటూ ఆ కుర్రాణ్ణి లోనికి లాక్కుపోయింది.

బుసలు కొడుతూ "నాయాల్డి. మీ అమ్మ ముఖం సూసి వదిలేశా! బతికిపోయావు" అంటూ వెళ్ళిపోయాడు.

❋ ❋ ❋

మరునాడు రంగనాయకులు క్లాసుకెళ్ళేటప్పటికి బోర్డు మీద 'రంగనాయకులు చవట' అని రాసి ఉంది. కోపంగా "ఎవర్రా! ఇది రాసింది" అడిగాడు. ఏ మాత్రం నదురూ బెదురూ లేకుండా "నేను" అంటూ పురుషోత్తం లేచి నిలబడ్డాడు. క్లాసులో విద్యార్థినీ విద్యార్థులంతా ఘొల్లున నవ్వారు. వాడిని వెదురు బెత్తంతో చితకబాదాడు రంగనాయకులు. దానితో తాత్కాలికంగా క్లాసులో నిశ్శబ్దం ఏర్పడింది.

సాయంకాలం ఇంటికెళ్ళేటప్పటికిగాని పురుషోత్తాన్ని కొట్టిన దానికి ఫలితం ఏమిటో రంగనాయకులికి తెలీరాలేదు. ఇంట్లో సామానంతా వెంకట్రావు తాలూకు మనుష్యులు వీధిలోకి విసిరిపారేశారు. భార్యా పిల్లలు వీధిలో వేరెవరి పంచనో నిలబడి ఉన్నారు. ఇంటి యజమాని లోపల గదులన్నీ కడిగిస్తూ, తుడిపిస్తూ కనిపించాడు. పక్క ఇంటి పిచ్చమ్మగారి ఇంట్లో సామాను వేసుకుంటానని చెప్పి... భార్యా పిల్లల్ని ఇవాళ్టికి అక్కడే గడపమని చెప్పి పోలీసు రిపోర్టివ్వడమే తక్షణ కర్తవ్యమని ఊరి చివరి కెళ్ళాడు. పొలిమేర దాటబోతుండగా వెంకట్రావు తన బలగంతో ఎదురయ్యాడు.

అడుగు ముందుకేస్తే దెబ్బలాడేలా వున్నారు. అందరి చేతుల్లో కర్రలు దర్శనమిచ్చాయి. అయినా ధైర్యంగా ముందుకి అడుగెయ్యబోయాడు.

"సూడు పంతులూ! నాది మాసెద్ద బుద్ధి, నోరు మూసుకెళ్ళిపోతే బతికిపోతావ్! రిపోర్టూ గాడిద గుడ్డూ... అంటూ ఏవన్నా నీలిగితే నీ ప్రాణానికే ముప్పు. నువ్వు ఊరు నాలుగేపులా ఎటెల్లినా నా మనుషులున్నారు. బాగా ఆలోసించుకొని ముందుకడుగెట్టు" అన్నాడు.

ఏవిటి వైపరీత్యం? రంగనాయకులు మనస్సు చెదిరింది. మతీ చెదిరింది. పిచ్చి పిచ్చిగా నవ్వుతూ వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు.

ఈనాడు పట్టణాలూ పల్లెలూ అనే తేడా లేదు. దుష్ట నాగులు నిండి వున్న ఈ లోకం ఒక నాగులు తిరిగే కోన. మంచికీ, మానవత్వానికీ సమాధి ఎప్పుడో కట్టేశారు. దానికి ఉదాహరణే ఈ కథ.

❋

తొలిసారిగా తల్లి కాబోతున్నారా!

డా॥ యన్. ఉదయిని, ఎం.డి.,
బెతూన్ నర్సింగ్ హోం, ఒంగోలు.

మాతృత్వం ఒక వరం. అది మీరు నిర్వహించబోయే అత్యంత ప్రధానమైన, బాధ్యతాయుతమైన పాత్ర కూడా. కాబట్టి గర్భధారణలో ఏం జరుగుతుందో... మీ పాపాయి ఎలా పెరుగుతుందో తెలుసుకోవాలి. అప్పుడు శారీరకంగా మానసికంగా మీలో కలగబోయే మార్పులతో మీరు నిభాయించుకురాగలరు.

గర్భధారణకి ముందు... తర్వాత... మొదటి మూడు నెలల కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకుందాం.

మీరు ఒకసారి తల్లి కావాలని నిశ్చయించుకున్న తర్వాత...గర్భధారణకు ముందు నుండే మీరు, మీ భాగస్వామి పూర్తిగా ఆరోగ్యంగా ఉండేందుకు ప్రయత్నించాలి. గర్భధారణికి ముందు మూడు నెలల నుండి ప్రత్యేకించి జాగ్రత్తలు తీసుకోవటం అవసరం.

ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పోషణ

మీరు మీ పాపాయి ఆరోగ్యం కోసం సమతుల్యమైన ఆహారం(పిండి పదార్థాలు, మాంసకృత్తులు, మినరల్స్, ఖనిజాలు, విటమిన్లతో కూడిన ఆహారం) తీసుకోవడం ఎంతో ముఖ్యం. గర్భం ధరించే ముందు నిలవచేసుకున్న పోషక పదార్థాల మీద గర్భస్థ శిశువు పెరుగుదల, ప్రధాన అవయవాలు రూపొందడం ఆధారపడి ఉంటుంది.

'బి' విటమిన్లలో ఒకటైన "ఫోలిక్ యాసిడ్" శిశువులో నరాల నాళికా లోపాలు రాకుండా తోడ్పడుతుంది. అందుకని గర్భం ధరించక ముందు నుండే ఈ ఫోలిక్ యాసిడ్ 5 ఎం.జి. బిళ్ళలను వాడడం ప్రారంభించాలి. అలాగే గర్భధారణ సమయంలో మొదటి మూడు నెలలు వీటిని నఇటఇవఈతప్పనిసరిగా తీసుకోవలి. గర్భవతిగా వున్నప్పుడు అదనపు ఆహారం అవసరం (సుమారు 300 క్యాలరీలు) అని మరువకండి.

తల్లి ఆరోగ్యం కొరకు, పెరుగుతున్న పిండం అవసరాలకి, ప్రసవ సమయంలో కావాల్సిన శక్తి, ఉత్సాహానికి తల్లి కణజాలాలు, పిండం, మాయ అభివృద్ధికి, చక్కగా పాలివ్వటానికి, బేసల్ మెటబాలిక్ రేటులో అభివృద్ధికి ఈ అదనపు క్యాలరీలను ఆహారం ద్వారా లేదా మందుల ద్వారా పొందాలి.

విటమిన్లు, ఖనిజాలు (ప్రత్యేకించి ఇనుము, కాల్షియం, జింకు) కూడా ఎక్కువ మోతాదులో అవసరం కనుక ఇవి కూడా మందుల ద్వారా తీసుకోవాలి.

జీవనసరళిలో మార్పులు

మీరు కాని, మీ భాగస్వామి కాని పొగతాగే వారైతే తక్షణమే మానెయ్యండి. దీని మూలాన గర్భధారణ ఆలస్యం కావచ్చు. లేదా గర్భస్థ శిశువుకి ప్రమాదం కలగవచ్చు. అంచేత గర్భం దాల్చక ముందే పొగ తాగడం మానివేయాలి.

మద్యపానం వలన కూడా గర్భధారణ ఆలస్యం కావచ్చు. గర్భస్థ శిశువు అభివృద్ధికి అడ్డుగా నిలుస్తుంది. అంగవైకల్యమూ సంభవించవచ్చు. దీన్ని పూర్తిగా మానెయ్యడం మంచిది.

వ్యాయామం

వ్యాయామం కూడా మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. కనుక వ్యాయామం చేయటం చాలా ముఖ్యం. వ్యాయామం కండరాలని ధృఢపరుస్తుంది. గర్భధారణ సమయంలో వచ్చే భారాలను భరించేందుకు తోడ్పడుతుంది.

మందులు వేసుకోవడం

ఫెర్టిలైజేషన్, తొలిదశలో శిశువు అభివృద్ధి చెందడం అనేవి శరీరంలో సున్నితంగా సంతరించ బడే రసాయనిక ప్రక్రియలు. ప్రత్యేకించి 4-9 వారాల కాలాన్ని 'పిండంలో అవయవాల అభివృద్ధి జరిగే కాలం' అంటారు. ఈ సమయంలో మందుల రూపంలో శరీరంలోకి ప్రవేశించే అదనపు రసాయనాలు ఈ అభివృద్ధిని భంగపరిచి అవయవ లోపాల్ని కలుగచేయవచ్చు. కాబట్టి గర్భం ధరించే ముందు, గర్భధారణ సమయంలో (మొదటి రెండు- రెండున్నర నెలలు) డాక్టరు సలహా లేకుండా ఎటువంటి మందులు తీసుకోకండి. చిన్న చిన్న రుగ్మతలకూ షాపుల్లో దొరికే మందులకు దూరంగా ఉండండి.

ఋతుస్రావాన్ని వెనక్కి నెట్టడానికి సర్వసాధారణంగా షాపుల్లో ఇచ్చిన మందులు తెచ్చి వాడేస్తుంటారు (ఏదో పండగ- పబ్బం కోసం). వీటి వలన పిండం మీద చాలా దుష్ప్రభావం ఉంటుంది. వాడిన తర్వాత నెల తప్పి గర్భం నిర్ధారణ అవుతుంది. అప్పుడు మాత్రమే డాక్టరు సలహా కోసం వస్తుంటారు. ఇలా కాకుండా వుండాలంటే డాక్టర్ సలహాతో మందులు వాడటం మంచిది.

మీరు కనుక దీర్ఘకాలంగా మందులును తీసుకుంటూ ఉంటే వీటి ప్రత్యామ్నాయాలను గురించి డాక్టరుతో చర్చించవలసి ఉంటుంది.

డయాబెటీక్స్

ఇది ఉన్నప్పుడు గర్భధారణకు ముందే షుగర్ కంట్రోల్ చేసుకోవాలి. మందుబిళ్ళలు వాడేవారు రెండు నెలల ముందే ఇన్సులిన్ సూదిమందును వేసుకోవడం ప్రారంభించాలి. రక్తంలో అధిక గ్లూకోజ్ వుండడం, మందు బిళ్ళలు వాడడం వలన గర్భస్థ శిశువులో అంగవైకల్యాలు రావచ్చు. కనుక ఈ జాగ్రత్తలు తప్పనిసరి.

అధిక రక్తపోటు

గర్భవతిగా వున్నప్పుడు డాక్టర్ సలహా మేరకు మాత్రమే క్షేమంగా వాడగలిగిన మందులే వేసుకోవాలి.

థైరాయిడ్

థైరాయిడ్ హార్మోను లోపించడం, థైరాయిడ్ హార్మోను అధికంగా వుండడం వలన శరీరంలోనే కాకుండా, గర్భస్థ శిశువులో కూడా చాలా తేడాలు వస్తాయి. కనుక థైరాయిడ్ పరీక్ష ద్వారా హార్మోను మోతాదు సమతుల్యంగా ఉంచుకోవడం చాలా అవసరం.

ఎపిలెప్సీ

మూర్ఛరోగులు గర్భధారణ సమయంలో డాక్టరు సలహాతో క్షేమంగా వాడగలిగిన మందులను మాత్రమే తీసుకోవాలి. వీటితో బాటు ఫోలిక్‌యాసిడ్ మాత్రలు తప్పనిసరిగా వాడాలి. టి.బి. గురించి వాడుతుంటే అవి ఆపకుండా కొనసాగించాలి. డాక్టరు సలహా లేకుండా జ్వరాలకు మందుల షాపులలో ఏదో ఒకటి తెచ్చి (యాంటిబయాటిక్స్) వాడకూడదు.

గర్భధారణ తొలి చిహ్నాలు

1) తప్పిన నెలసరి ఋతుక్రమం, 2) స్థనాలు పెద్దవి అవటం, కాస్త నొప్పిగా... తిమ్మిరిగా అనిపించటం, 3) నోటిలో ఒక రకపు చేదు రుచి, 4) రోజంతా అలసిపోయినట్లుండటం, తల తిరగడం, 5) వికారం లేక వాంతులు. కొన్ని ఆహారాలు, వాసనలు వికారాన్ని ఎక్కువ చేయటం, 6) తరచుగా మూత్ర విసర్జన.

గర్భధారణ నిర్ధారణ

ఒక చిన్న మూత్ర పరీక్ష ద్వారా గర్భధారణ నిర్థారించవచ్చు. మీ పిరియడ్ తారీకు రావాల్సిన రోజునే ఈ పరీక్ష చేయవచ్చు. ఈ పరీక్షలో 'హెచ్.సి.జి" అనే హార్మోన్ల స్థాయిని కొలవవచ్చు. గర్భిణి మొదటి మూడు నెలల కాలాన్ని (12 వారాలు) మొదటి త్రైమాసికం అంటారు. అప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలుసుకుందాం.

నిత్యపరిపాటి పరీక్షలు

1) హిమోగ్లోబిన్, 2) ఎ.బి.ఓ., ఆర్.హెచ్ (గ్రూపుల పరీక్ష, 3) వి.డి.ఆర్ ఎల్ పరీక్ష, 4) ర్యాన్‌డమ్ రక్తపు గ్లూకోజ్ పరీక్ష, 5) మూత్రంలో ప్రొటీన్లు, చక్కెర , చీము కణాలకై పరీక్ష.

ప్రత్యేక పరీక్షలు

అవసరాన్ని బట్టి కొన్ని ప్రత్యేక పరీక్షలు చేయవలసి వుంటుంది.

1) హెపిటైటిస్ 'బి' వైరస్ పరీక్ష 2) హెచ్.ఐ.వి. పరీక్ష, 3) ట్రిపుల్ టెస్ట్ - 16,18 వారాలలో గర్భస్థ శిశువుకి నరాల నాళికా లోపాలు, క్రోమోజోముల గురించి, 4) అల్ట్రా సౌండ్ పరీక్ష: మొదటి మూడు నెలల్లో అవసరాన్ని బట్టి ఈ పరీక్ష చేయవచ్చు. దీని ద్వారా - గర్భధారణ నిర్ధారణ, గర్భస్థ పిండాలు ఎన్ని ఉన్నాయని కనిపెట్టడం, గర్భస్థ శిశువు పెరుగుదల, ఆరోగ్య వైపరీత్యాలు, గర్భసంచికి పక్కన అండాశయం.. బిడ్డ పేగుకు సంబంధించిన తేడాలను కనిపెట్టవచ్చు. గర్భవతి తన రోజువారి కార్యకలాపాలను మామూలుగా సాగించవచ్చు. కాకపోతే మరీ బరువైన, శ్రమకోర్చే పని చేయకూడదు. రోజుకి సగటున పది గంటలు నిద్ర అవసరం (రాత్రి ఎనిమిది గంటలు మధ్యాహ్నం రెండు గంటలు). వదులైన, అనువుగా వుండే దుస్తులు ధరించాలి.

కుదుపులు ఇచ్చే వాహనాల్లో ప్రయాణాలు మానాలి. బస్సుకన్నా రైలు ప్రయాణం మేలు. లైంగిక సంభోగం మొదటి మూడు నెలల్లో మరియు చివరి నాలుగు వారాల్లోనూ లేకుండా ఉంటేనే మంచిది.

గర్భధారణలో చిన్న చిన్న రుగ్మతలు- చిట్కాలు

మల బద్ధకం

హార్మోన్ల ప్రభావం వలన పేగులలోని కండరాలు సడలి పేగుల కదలిక మందగిస్తుంది. దీని వలన మలబద్ధకం వస్తుంది. దీని కొరకు పీచు పదార్థాలను ఎక్కువగా తినాలి. నీళ్లు ఎక్కువగా తాగాలి. పండ్ల రసాలు కాకుండా పండ్లనే తినాలి. ఒక్కోసారి ఐరన్ బిళ్లల వలన కూడా మల బద్ధకం రావచ్చు. ఈ చిన్న చిట్కాలతో కూడా తగ్గనట్లయితే డాక్టరుని సంప్రదించండి.

స్పృహ తప్పినట్లు ఉండటం

గర్భధారణలో రక్తపోటు తక్కువగా ఉంటుంది. అంచేత ఇలా అనిపిస్తుంది. ఎక్కువ సేపు నిలబడి ఉండకూడదు.

తరచూ మూత్ర విసర్జన

గర్భకోశం మూత్రాశయంపై నొక్కుతూ ఉండడం వలన కలుగుతుంది. రాత్రి కనక తరచూ వెళ్ళాల్సి వస్తే సాయంత్రాలు తక్కువ నీళ్ళు తాగండి. నొప్పి కూడా వుంటే ఇన్‌ఫెక్షన్ వలన కావచ్చు. కాబట్టి డాక్టరును సంప్రదించండి.

పొద్దున వికారం, వాంతులు

ఇది మొదటి మూడు నెలల తర్వాత సాధారణంగా తగ్గుతుంది. పొద్దుటే కాకుండా రోజులో ఏ సమయంలోనైనా వాంతులు కావచ్చు. మీకు ఇష్టం లేని వాసనలకు, ఆహారాలకు దూరంగా ఉండండి. రోజంతా తరచుగా కొంచెం కొంచెంగా తింటూ ఉండండి.

క్రాప్స్-తిమ్మిరి

కాలి కండరాలలో ఎక్కువగా వస్తుంది. కాల్షియం లోపం వలన కావచ్చు. అందుకని రోజూ తప్పనిసరిగా కాల్షియం బిళ్ళలు, కాల్షియం ఎక్కువ ఉన్న పదార్థాలు (పాలు, పండ్లు) తీసుకోవాలి.

గుండెలో మంట

మీ జీర్ణాశయ ప్రవేశ ద్వారం వద్ద ఉన్న కవాటం హార్మోనుల వలన గర్భధారణ సమయంలో సడలుతుంది. అందువల్ల జీర్ణాశయంలోని ఆమ్లాలు అన్న వాహికలోకి తిరిగి వచ్చి ఈ మంటను కలుగజేస్తాయి. కారం వున్న ఆహారాలు తినకండి. మంచం తలవైపు ఎత్తుగా అదనపు దిండ్లు ఉపయోగించండి. డాక్టరును సంప్రదించి అసిడిటీకి మందులు వాడండి.

రక్తం కారుతున్న పళ్ళ చిగుళ్ళు

గర్భధారణ సమయంలో రక్తప్రసరణ ఎక్కువయి చిగుళ్ళు బాగా మెత్తబడతాయి. రోజూ రాత్రి భోజనం తర్వాత పళ్ళని బాగా తోముకోవాలి. మరీ ఇబ్బందిగా ఉంటే పళ్ళ డాక్టరుని కలవాలి.

మొదటి త్రైమాసికానికి గర్భధారణలో ఎంత ప్రాముఖ్యత ఉందో మీరు గ్రహించారు. కనుక నెల తప్పిన వెంటనే డాక్టరుని సంప్రదించండి. సాధారణంగా ఎక్కువ సార్లు డాక్టరు సలహా పొందేసరికి ఈ మూడు నెలల గడిచిపోయి ఉంటుంది. అలా కాకుండా తక్కువ ఖర్చుతోనే డాక్టర్ సలహాతో ఈ కొన్ని జాగ్రత్తలతో మీరు... మీ పాపాయి... సురక్షితంగా బయట పడాలంటే నెల తప్పిన వెంటనే డాక్టరు సలహా తీసుకోవటం మంచిది.

❄



ఏరి ఏరి గుమ్మడి పండు ఏరి పేరేమి?

ఈ ఫొటో ఓ బాలీవుడ్ నటిది. ఆమె ఎవరో చెప్పుకోండి చూద్దాం? జవాబు కోసం 22వ పేజీలో చూడండి.

చిరంజీవితో 'మాస్టర్', మహేష్‌బాబుతో 'రాజకుమారుడు' చిత్రాల్లో నటించిన **సాక్షి శివానంద్** ఆ తర్వాత రాజశేఖర్ నటించిన 'సింహరాశి'లో ... ఇంకా పలు చిత్రాల్లో నటించింది. ఆ తర్వాత మళ్ళీ చాన్నాళ్ళకు జె.డి. చక్రవర్తి దర్శకత్వంలో రూపొందు తోన్న 'హోమం'లో నటిస్తోంది. ఈ చిత్రంలో ఐటమ్ సాంగ్‌లో కన్పిస్తోంది. ఈ సందర్భంగా ఆమెతో పెండ్యాల మురళి జరిపిన ఇంటర్వ్యూ...

మంచి అమ్మననిపించుకోవాలి

హీరోయిన్‌గా చేసి ఐటమ్ సాంగ్‌లో నటించదానికి కారణం?

ప్రత్యేక కారణం ఏమీలేదు. జెడి. చక్రవర్తి మంచి స్నేహితుడు. జగపతిబాబు కూడా మంచి నటుడు. ఇది వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తోన్న చిత్రం గనుక క్రేజ్ ఉంటుంది. టాలీవుడ్‌లో చేయడం కొత్త కాకపోయినా చాలా కాలం తర్వాత చేయడం థ్రిల్‌గా ఉంది.

ఇది సెకండ్ ఇన్నింగ్స్ అనుకోవచ్చా?

నేను అలా భావించడంలేదు. మంచి అవకాశాలు, డబ్బు వస్తున్నా...బిజీ లైఫ్‌లో నాకు ప్రశాంతమైన జీవితాన్ని గడపాలనుంది. అందుకే నటిగా అవకాశాలొచ్చినా విరమించుకుంటున్నాను. నటన అనేది నా జీవితంలో ఒక భాగం మాత్రమే. సాధించాల్సింది చాలా ఉంది. ఎందుకంటే రేపు నా పిల్లల ముందు నటిగా కంటే మంచి అమ్మగా నిలబడాలన్నది నా కోరిక.

సినిమాల్లో నటించకపోవడానికి కారణం?

సినిమా ఒక్కటే జీవితం కాదు. నాకూ కొన్ని వ్యాపకాలున్నాయి. నా చదువుకు, నటనకు అవరోధం కాకుండా చూసుకుంటున్నాను. కొన్ని అవకాశాలు వచ్చినా సున్నితంగా తిరస్కరించాను. జ్యూయలరీ డిజైన్ కోర్సును లండన్‌లో పూర్తిచేశాను.

జ్యూయలరీ డిజైన్ చేయదానికి కారణం?

నాకది ఇష్టం. త్వరలో ఇండియాలో అందులోనూ హైదరాబాద్‌లోనూ జ్యూయలరీ వ్యాపారాన్ని పెట్టబోతున్నాను.

మళ్ళీ ఐటమ్ సాంగ్స్ చేస్తారా?

ఇంకా ఆలోచించలేదు. జేడీ చక్రవర్తితో ఉన్న అనుబంధంతో చేస్తున్నాను.

హైదరాబాద్‌లో మియాపూర్‌లో మీ స్థలం కోర్టు కేసు వరకు వచ్చింది. ఆ వివరాలు?

ముందుగా ఈ విషయంలో మీడియాకు థ్యాంక్స్ చెప్పాలి. నాకు సంబంధించిన ఆ స్థలం వల్ల కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. అవి మీడియా బహిర్గతం చేయబట్టే.. నాకు సపోర్ట్‌గా నిలిచాయి. దాన్ని సబితా ఇంద్రారెడ్డిగారు కేర్ తీసుకుని నాకు న్యాయం చేశారు. మరో విశేషం ఏమంటే... నా స్థలం పక్కనే జె.డి. చక్రవర్తి స్థలం ఉంది. నేను కోర్టుకెళ్ళాక ఆయన కూడా స్థలం కోసం ముందుకు వచ్చారు.

మీ గ్లామర్ రహస్యం?!

ప్రత్యేకంగా ఏమీ చేయను. తిండి విషయంలో కంట్రోల్‌గా వుంటాను. ఈమధ్యనే జిమ్‌కు వెళుతున్నాను.

ఇష్టమైన ఫుడ్

ఇటాలియన్ ఫుడ్..

పెళ్ళెప్పుడు చేసుకుంటారు?

మూడేళ్ల తర్వాతే..

ఎలాంటి వ్యక్తిని చేసుకుంటారు? ఇండస్ట్రీకి సంబంధించిన వ్యక్తినా?

ఇండస్ట్రీకి చెందిన వ్యక్తిని అస్సలు చేసుకోను. నా భర్త సింపుల్‌గా వుండాలి. నేచురల్‌గా బిహేవ్ చేయాలి. హీరోలా కాదు. ఇండస్ట్రీలో ఐదుశాతం మంచివాళ్ళు. మిగిలిన వారంతా అలా కాదు. పెళ్ళిబంధంపై నమ్మకమున్న వ్యక్తి అయి వుండాలి. ముఖ్యంగా నా జ్యూయలరీ బిజినెస్‌కు తోడుగా వుండాలి.

❄

వీరి వీరి గుమ్మడి పండు

జవాబు

వీరి వీరి గుమ్మడి పండు వీరి పేరు ప్రీతి జింటా.



కేసర్ పిస్తా ఐస్‌క్రీమ్

కావలసిన పదార్థాలు

పాలు- 1/2 లీటరు, కార్న్‌ఫ్లోర్- 1 కేజీ, పంచదార- 1/2 కప్పు, తాజాక్రీమ్-1 కప్పు, గ్లూకోజ్ పౌడర్-1/2 కప్పు, కేసర్ కలర్-1/4 టీ స్పూన్, కేసర్ ఎసెన్స్-2 చుక్కలు, కుంకుమపువ్వు-1/4 టీ స్పూన్ కన్నా తక్కువ, పిస్తా తరుగు-2 టీ స్పూన్లు

తయారు చేసే విధానం

పాలు 1/2 కప్పు తీసి వేరే ఉంచాలి. మిగిలిన పాలను సగం వరకు మరిగించి చల్లార్చుకోవాలి. చల్లని పాలలో కార్న్‌ఫ్లోర్, పంచదార కలపాలి. వీటిని మరిగే పాలలో వేసి ఐదు నిమిషాలు ఉడికించాలి. తీసి చల్లార్చి క్రీమ్, గ్లూకోజ్ పౌడర్, రంగు ఎసెన్స్, కుంకుమ పువ్వు వేసి కలిపి గ్రైండ్ చేసుకోవాలి. తర్వాత తీసి ఫ్రిజ్‌లో పెట్టాలి. ఇందులో పిస్తా తరుగును వేసి మళ్ళీ తిప్పాలి. బౌల్‌లో వేసి మూత పెట్టి ఫ్రిజ్‌లో పెట్టాలి దీన్ని డీప్ చేయాలి. అంతే రుచికరమైన కేసర్ పిస్తా ఐస్ క్రీమ్ రడీ. ప్లేట్ల మీద పెద్ద కప్పుల్లో... ఐస్ క్రీమ్ పెట్టి దానిపై కుంకుమ పువ్వు చల్లాలి. ఇంకా...ప్లేట్‌లో కప్పు చుట్టూ పిస్తాలను చల్లాలి. దీన్ని పిల్లలు చాలా చాలా ఇష్టంగా లాగించేస్తారు.



సేమ్యా పకోడీలు

కావలసిన పదార్థాలు

సేమియా- 1 కప్పు, శనగపిండి- 1 కప్పు బియ్యం పిండి- 2 టీ స్పూన్లు, సోడా- కొంచెం. కారం- 1 1/2 టీ స్పూన్, నూనె- చేయడానికి సరిపడినంత, ఉల్లిపాయ ముక్కలు- అరకప్పు

తయారు చేసే విధానం

ఒక కప్పు సేమియా తీసుకోవాలి. మూడు కప్పుల నీళ్లు పోసి ఐదు నిమిషాలు ఉడికించాలి. తర్వాత చిల్లుల పళ్ళెంలో పోసి నీళ్ళు పోయేవరకు ఆగాలి. తర్వాత దానిమీద చల్లటి నీళ్లు పోయాలి. దీనివల్ల సేమియా అంటుకోకుండా విడివిడిగా ఉంటుంది. తర్వాత ఒక గిన్నెలో శనగపిండి తీసుకొని దానిలో ఉల్లిపాయలు, ఉప్పు, కారం, సోడా వేసి కలిపిన తర్వాత సేమియా వేసి కలపాలి. మరీ గట్టిగా కాకుండా, జారుగా కాకుండా పిండిని కలుపుకొని పకోడీల్లా నూనెలో వేయాలి.

రుచి

మ్యాంగో కుల్ఫీ

కావలసిన పదార్థాలు

చిక్కటి పాలు -1/2 లీటరు లేదా 2 కప్పులు, కండెన్స్‌డ్ మిల్క్-1/4 కప్పు, కార్న్‌ఫ్లోర్- 2 టీ స్పూన్లు, మామిడి గుజ్జు -1 కప్పు, పంచదార-1/2 కప్పు

తయారు చేసే విధానం

మందపాటి గిన్నెలో పాలు మరిగించాలి. కండెన్స్‌డ్ మిల్క్ వేసి పంచదార కలపాలి. కొంచెం పాలలో కార్న్ ఫ్లోర్ కలిపి పై మిశ్రమంలో పోయాలి. వీటిని మరిగించి చల్లార్చి, దీనికి మామిడి గుజ్జు కలపాలి. కుల్ఫీ గిన్నెలో వేసి మూత పెట్టాలి. ఫ్రిజ్‌లో పెట్టి చల్లగా అయిన తరువాత తీసి గోరు వెచ్చని నీళ్లలో గిన్నెను రెండు నిమిషాలు వేసి తీయాలి. మూత తీసి చాకుతో రౌండ్‌గా తిప్పి, కుల్ఫీని ప్లేట్‌లో అమర్చాలి. చుట్టూ మామిడి ముక్కలను అమర్చి చల్లగా ఇవ్వాలి. వేసవిలో పిల్లలు చాలా ఎంజాయ్ చేస్తారు.





సగ్గుబియ్యం కేక్

కావలసిన పదార్థాలు

గోధుమలు-1/4 కిలో, పంచదార- 1/4 కిలో, జీడిపప్పు- 100 గ్రా.,సగ్గు బియ్యం- 1/4 కిలో, నెయ్యి లేక డాల్డా- 1/4 కిలో, కిస్‌మిస్- 100 గ్రా.

తయారు చేసే విధానం

ముందుగా గోధుమలు, సగ్గుబియ్యం వేరువేరుగా నానపోసుకోవాలి. కేక్ చేసుకొనే రోజున వాటిన కడిగి మిక్సీలో వేయించుకొని పొడి చేసుకోవాలి. ఒక వెడల్పాటి గిన్నెలో కొంచెం నెయ్యి రాసి...ఇందాక మిక్సీ వేసుకున్న పొడి పోసి సన్నని సెగలో అడుగంటకుండా గరిటతో కలియబెట్టాలి. మరొక స్టౌ మీద పంచదారను నీళ్లలో పోసి వేడి చేసుకోవాలి. లేత పాకం వచ్చేవరకు వుంచాలి. ఉడికిన పిండి మిశ్రమాన్ని, మిగిలిన నెయ్యిని పాకంలో వేసి బాగా ఉడకనివ్వాలి. జీడి పప్పు, కిస్‌మిస్ కూడా అందులో వేసుకోవాలి. తరువాత నెయ్యి రాసి ఉంచుకొన్న పళ్ళెంలోకి దీనిని వంచి మనకు కావలసిన సైజులో ముక్కలుగా కోసుకోవాలి.

ఏది చేసినా భయమే

నా పేరు శ్యామ్. వయస్సు 20 సంవత్సరాలు. ఆ పని చేస్తే ఏమవుతుందో, ఈ పని చేస్తే ఏమవుతుందో, అపజయం ఎదురయితే ఎలా అని భయపడుతుంటాను. ఈ సమస్యకు పరిష్కారం తెలుపగలరు?

శ్యామ్, విజయవాడ.

సమాజంలో చాలా మంది ఎవరి పనులు వారు చేసుకోలేక పోవటానికి కారణం "భయం". అది మనిషిలో తగినంత మాత్రమే వుంటే, కార్యాచరణకు ఒక ప్రేరణగా ఉపయోగపడ్తుంది. 'పరీక్షలు దగ్గర పడ్తున్నాయి' అనే భయం వుంటేనే విద్యార్థి తగిన జాగ్రత్తలు తీసుకుంటాడు. పరువు పోతుందేమోనన్న భయం, పరువుగా వుండే పనులను ప్రేరేపిస్తుంది. నీవు తగిన జాగ్రత్తతో వుంటే భయం గురించి భయపడనవసరం లేదు. మనిషి మనుగడకు భయం ప్రధానమైంది. మీరు అనవసరంగా భయపడుతున్నారు. ఈనాటి అపజయమే రేపటి "విజయం". అపజయం ఎదురయితే అదొక పాఠంగా తీసుకోవాలి. కొత్త పని చేసినప్పుడు విజయవంతం కాకపోవడానికి ఎన్ని అవకాశాలుంటాయో, విజయవంతం అవడానికి అన్నే అవకాశాలు ఉంటాయి. మీరు పని మీద ఎక్కువగా దృష్టి పెట్టండి. ఈ భయాలకు రిలాక్సేషన్ బాగా వుపయోగ పడుతుంది. కౌన్సెలింగ్ ద్వారా భయాల పట్ల సదవగాహన పెంపొందించుకోవచ్చు. భయాన్ని ఎన్.ఎల్.పి. ఫాస్ట్ ఫోబియో టెక్నిక్ ద్వారా పోగొట్టవచ్చు.

పిల్లలు మాట వినట్లా

నా పేరు సుబ్బారావు. నేను బిజినెస్ చేస్తున్నాను. నాకు ముగ్గురు పిల్లలు. నా పని రీత్యా పిల్లలతో గడపటం తక్కువ. వాళ్ళు చెప్పిన మాట వినడం లేదు. సరిగ్గా చదవటం లేదు. దీనికి పరిష్కారం తెలియజేయగలరు.

సుబ్బారావు, నాగోల్.

తల్లిదండ్రులు పిల్లలు తాము చెప్పినట్లే వినాలని, శాసించే తరహాలో ఉండటం ప్రమాదకరమైన లక్షణం. పిల్లల మనో భావాలను అర్థం చేసుకోవడం ఎంతో అవసరం. మీరు కొంత సమయం, ప్రేమ వారికి అందివ్వాలి. వారు ఏ అంశంపై ఉత్సాహం చూపుతున్నారో గమనించండి. పిల్లల భవిష్యత్తు విషయంలో ఇద్దరికీ సమ బాధ్యత ఉండాలి. ఏదైనా మంచి పని చేసినప్పుడో, ఏదైనా సాధించినప్పుడో... బహుమతి అందించి, తగిన విధంగా ప్రోత్సహిస్తే వారిపై ఆ ప్రభావం ఎంతగానో ఉంటుంది. ప్రతిరోజు కొంతసేపు వారి వద్ద కూర్చోగలిగితే భవిష్యత్తులో విజేతలుగా నిలుస్తారు. పిల్లలు ఏ



ప్రశ్నలు అడిగినా విసుక్కోకుండా సమాధానం చెప్పండి. పిల్లల ముందు గొడవపడటం, అబద్ధాలు చెప్పడం చేయకండి. టీవీలో విజ్ఞానాన్ని పెంచే ఛానల్స్ చూసే విధంగా అలవాటు చేయండి. పిల్లలను ఇతరులతో పోల్చకండి. ఏ విషయం చెపుతున్నా ఓపికగా వినండి. వీలు ఉన్నప్పుడు పిల్లలను బయటకు తీసుకువెళ్లండి. అప్పుడప్పుడు దగ్గరకు తీసుకోవడం, వెన్ను తట్టడం, తల నిమరడం, ముద్దు పెట్టుకోవడం చేయండి. అప్పుడు మీ మాటలు వింటారు.

లావు తగ్గాలంటే...

నా వయస్సు పదమూడు సంవత్సరాలు. నేను అయిదడుగుల ఎత్తు, బరువు 65 కిలోలు. డైటింగ్ చేద్దామనుకుంటున్నాను. 'డైటింగ్ చేస్తే నీరసం వస్తుంది తప్ప బరువు తగ్గవు' అంటున్నారు. నాకేమో లావుగా వుండటం వల్ల బయటకు వెళ్లలేక పోతున్నాను. నేను ఏమి చేయాలో చెప్పగలరు?

పుణ్యవతి, విజయవాడ.

లావుగా వున్నవాళ్ళు ఈ సమాజంలో ఎంతో మంది ఉన్నారు. కొంత మంది హీరోయిన్లుగా కూడా చేస్తున్నారు. ఇతర దేశాలవారు లావుని వరంగా భావిస్తున్నారు. లావుగా వున్నవాళ్లకి పోటీలు పెడుతూ వాళ్లని ప్రోత్సహిస్తున్నారు. నీవు ఎందుకు లావు అవుతున్నావో పరిశీలించు. వంశ పారంపర్యంగా, హార్మోన్ల వల్ల, మానసిక ఒత్తిడి వల్ల, ఆహారపు అలవాట్ల వల్ల లావు అవుతారు. నీవు మెన్సెస్ అయితే నెలసరి సరిగ్గా వస్తోందో లేదో ఆలోచించుకోండి. ఎవరో ఏదో అనటం వల్ల ఈ లావు తగ్గదు. లావు గురించి బెంగ పడకుండా నీ చదువు మీద దృష్టి పెట్టు. నీవు డాక్టర్‌ని సంప్రదించు. నీ శరీర తత్వం ఏంటి? ఇలా ఎందుకు లావు అవుతున్నావో చెపుతారు. డాక్టర్ చెప్పినట్లు చేస్తూ కౌన్సెలింగ్ సైకాలజిస్ట్‌ని కలువు. నీ శరీరతత్వానికి తగిన విధంగా వ్యాయామం చేయండి. చక్కగా లావు తగ్గుతారు.

మనసా... తెలుసా?

హిప్నో కమలాకర్
ఫోన్ నెం: 9390044031




మాధురీ దీక్షిత్

శ్రీదేవి

తనూజ

ఎంత పెద్ద స్టారైనా

అమ్మ అమ్మే...

వీరంతా వెండితెర వేల్పులు. టాలీవుడ్, బాలీవుడ్‌ను ఒక ఊపు ఊపారు. తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని, అభిమానులను సంపాదించుకున్నారు. రంగుల ప్రపంచంలో ఎన్నో రకాల పాత్రలు పోషించిన వీరు... ఖచ్చితంగా తల్లిపాత్ర కూడా చేసే వుంటారు. కానీ నిజ జీవితంలో తల్లి కావడం...స్వచ్ఛమైన తల్లి ప్రేమను బిడ్డలకు పంచి ఇవ్వడంలో ఎంతో తృప్తి వుంటుంది. అమ్మతనాన్ని చవిచూస్తున్నప్పుడు మాత్రమే .... పల్చగా తడిచిన కనురెప్పల మాటున ...ఆ తృప్తి తాలూకు మెరుపు వుంటుంది. అది వీళ్లందరి కళ్లల్లో వుంది. మరి మీకు కనిపించిందా!

- అల


నర్గీస్

మలైకా అరోరా


కరిష్మా కపూర్

కాజోల్

రేణూ దేశాయ్

జూహీచావ్లా

OK
కథా నిలయం శ్రీకాకుళం

కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీక్కూడా వీళ్లలాగా కలంస్నేహం చెయ్యాలని ఉందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్‌ఫోటోను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలంస్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్: కలం స్నేహం, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

పేరు : కటారు అనంత్ కుమార్
చదువు: 10వ తరగతి
వయసు: 15 సం॥
స్కూలు : శ్రీలం రామ్మోహన్ రెడ్డి ఉన్నత పాఠశాల
లక్ష్యం: ఇంజనీర్ కావడం
హాబీలు : చదవడం, టీవీ చూడడం
చిరునామా : కె. అనంత్ కుమార్, బనిగండ్ల పాడు, ఎర్రుపాలెం (మం), ఖమ్మం.

పేరు : ఎ. కృష్ణం రాజు
చదువు: 5వ తరగతి
వయసు: 10 సం॥
స్కూలు : శ్రీవాణీ విద్యాల[illegible] యుపిఎస్., నంగునూర[illegible]
లక్ష్యం: టీచర్ కావడం
హాబీలు: చదవడం, టీవీ చూడడం
చిరునామా : ఎ. కృష్ణం రాజు, సన్నాఫ్: సంపత్, జాలపల్లి, మద్దూర్, వరంగల్.

పేరు : టి. రామాంజనేయులు
చదువు: 8వ తరగతి
వయసు: 13సం॥
స్కూలు : శ్రీ రవీంద్ర విద్యానికేత్ స్కూల్
లక్ష్యం: ఇంజనీర్ కావడం
హాబీలు : క్రికెట్ ఆడడం, పాటలు వినడం
చిరునామా : టి.రామాంజనేయులు, సన్నాఫ్: టి. వెంకటరాములు, గద్వాల్, మహబూబ్‌నగర్.

పేరు : పూర్ణకంటి రాములు.
చదువు:7వ తరగతి
వయసు: 14సం॥
స్కూలు : జడ్.పి.హెచ్. సూ[illegible]
లక్ష్యం: కలెక్టర్ కావడం
హాబీలు: పాటలు పాడడం, కథల పుస్తకాలు చదవడం
చిరునామా : పి. రాములు, సన్నాఫ్: పి. కాశన్న కొత్త చెరువు తాండ, అంబట్‌పల్లి, లింగాల, మహబూబ్‌నగర్.

పేరు : కె. శ్రీనివాస్
చదువు: 10వ తరగతి
వయసు: 15 సం॥
స్కూలు : జడ్.పి.హెచ్.ఎస్.
లక్ష్యం: డాక్టర్ కావడం
హాబీలు : పేపర్ చదవడం, టీవీ చూడడం, చెస్ ఆడడం
చిరునామా : కె. శ్రీనివాస్, సన్నాఫ్: హనుమంతు, గౌడ్‌దేవిపల్లి, గోపాల్ పేట్, మహబూబ్‌నగర్

పేరు : బి.రాజేష్
చదువు: 5వ తరగతి
వయసు: 10సం॥
స్కూలు : శ్రీవాణి వాద్యాలయం, యుపిఎస్, నంగునూరు
లక్ష్యం: టీచర్ కావడం
హాబీలు : పేపర్ చదవడం, టీవీ చూడడం, ఆటలు ఆడడం
చిరునామా : బి. రాజేష్ సన్నాఫ్: యాఖుబ్, జాలపల్లి, మద్దూర్, వరంగల్.